

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్


తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -158 | పేజీలు - 8 | వెల ₹03/- | సోమవారం14 సెప్టెంబర్ 2026



పాఠకులకు ప్రకటనకర్తలు శ్రేయోభిలాషులకు

వినాయకచవితి శుభాకాంక్షలు

నేడు వినాయకచవితి పర్వదినం సందర్భంగా పత్రికా కార్యాలయానికి సెలవు. కావున రేపు (మంగళవారం 15-9-2026) సంచిక వెలువడదు .. (పునర్దర్శనం బుధవారం)

పల్నాడు జిల్లాలో విషాదం .. పిడుగుపాటుకు నలుగురు మృతి



2లో

టెక్నాలజీపై గుత్తాధిపత్యం ప్రమాదకరం



సాంకేతికతను, క్రిటికల్ మినరల్స్‌ను ఆయుధాలుగా వాడటం ప్రపంచానికే ముప్పు

బ్రిక్స్ సదస్సు ముగింపు కార్యక్రమంలో మోదీ

క్రిటికల్ మినరల్స్ సరఫరాపై చైనా నియంత్రణ

ఆ దేశాధ్యక్షుడి సమక్షంలోనే ప్రధాని వ్యాఖ్యలు

గ్లోబల్ సౌత్‌కు బ్రిక్స్ కూటమే బలమని వెల్లడి

న్యూఢిల్లీ సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్): కీలక ఖనిజాలను ఆయుధాలుగా మారిస్తే అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతాయని ప్రధాని నరేంద్ర మోడీ బ్రిక్స్ సభ్యదేశాలను హెచ్చరించారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనప్పటికీ వాటిని తట్టుకొని నిలబడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు.న్యూఢిల్లీలోని భారత మండపంలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ఆదివారం ప్రసంగిస్తూ 'సాంకేతిక తను, కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చడం మన పురోగతికి ఆటంకం కలిగిస్తుంది. మిగతా2లో...

ఆసియా కప్ గెలిచిన టీమిండియా



శ్రీచరణి స్పిన్ మ్యాజిక్..

8వ సారి ఆసియా కప్ గెలిచిన టీమిండియా

మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్లో శ్రీలంకపై భారత్ ఘన విజయం

ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధనల మెరుపు అర్ధశతకాలు

బంతితో అద్భుతం చేసిన యువ బౌలర్ శ్రీ చరణి.. 4 వికెట్లతో రాణించిన వైనం

72 పరుగుల భారీ తేడాతో గెలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్న టీమిండియా

భారత్ నిర్దేశించిన 184 పరుగుల లక్ష్య ఛేదనలో 111 పరుగులకే కుప్పకూలిన లంక

న్యూఢిల్లీ సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్): మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్లో భారత జట్టు అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. దుబాయ్ వేదికగా జరిగిన తుది పోరులో శ్రీలంకను 72 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి రికార్డు స్థాయిలో 8వ సారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (68), స్మృతి మంధన (59) బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టిస్తే, యువ బౌలర్ శ్రీ చరణి (4/20) బంతితో మాయ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. మిగతా2లో...

ఐక్యంగా ఉంటేనే మీకు కోటా..వాటా..



సీఎంలంతా గల్లాపెట్టె రోశయ్యకే..

ఇచ్చారు.. గాంధీజీ మీ వాడే: రేవంత్

ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన

సీఎం మాటల్లోనే కలినత్వం..

చేతల్లోనూ ఉంటే ఎంతో మంది జైలుకెళ్లేవారు: టీజీ వెంకటేశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్): ఆర్యవైశ్యులంతా సమైక్యంగా ఉండాలని, పోటీ ప్రపంచంలో సవాళ్లను ఎదుర్కోవ డానికి సిద్ధం కావాలని సీఎం రేవంత్ అన్నారు. సమయస్ఫూర్తితో రాజకీయాల్లో కోటా, వాటా దక్కించుకోవాలని సూచించారు. అందరూ ఒక్కతాటిపై నడిస్తే వారిని గౌరవించనివారు ఉండరని పేర్కొన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి మిగతా2లో...

మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



2లో



మెగా డీఎస్సీలో భారీ స్కామ్..

- కూటమి సర్కారుపై వైఎస్ జగన్ మళ్లీ ఫైర్

అమరావతి సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్): టీడీపీ ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ స్కామ్ జరిగిందంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మరోసారి మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. ఓ అభ్యర్థి విషయంలో జరిగింది సరైన, పారదర్శక విధానమేనా..? అని ముఖ్యమంత్రి చంద్రబాబును

మిగతా2లో...

(టెట్) జూన్ 2026 ఫలితాలు విడుదల

ఏపీ టెట్-2026 జూన్ ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల్లో 51%, సాధారణ అభ్యర్థుల్లో 47 శాతం మంది ఉత్తీర్ణత

అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్ నంబర్ ద్వారా ఫలితాలను తెలుసుకునే అవకాశం

ఉత్తీర్ణులైన వారికి శుభాకాంక్షలు, అర్హత సాధించని వారికి ధైర్యం చెప్పిన లోకేశ్

అమరావతి సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త. ఏపీ టెట్-2026 జూన్ కు సంబంధించిన ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం విడుదల చేశారు. ఈ పరీక్షలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు 51 శాతం ఉత్తీర్ణత సాధించగా, సాధారణ అభ్యర్థులు 47 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వెల్లడించారు.



మిగతా2లో...

పండుగ రోజే విచారణకు పిలుపు!

- కేటీఆర్ పీఏ, పీఆర్వోకు పోలీసుల నోటీసులు • రేవంత్ సర్కార్ కక్షపూరిత ధోరణికి ఇదే నిదర్శనం



2లో

2029 కల్లా ఎన్డీయే రాష్ట్రాల్లో యూసీసీ అమలు

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్): వచ్చే లోక్‌సభ (2029) ఎన్నికల లోపు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే రాష్ట్రాల్లో యూసీసీ (ఉమ్మడి పౌరస్మృతి)ని అమలుజేయబోతున్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. బీజేపీ పాలనలో ఉన్న 21 రాష్ట్రాల్లో యూసీసీని ప్రవేశపెడుతామని తెలిపారు. ఆదివారం

మిగతా2లో...



ఐక్యంగా ఉంటేనే మీకు కోటా.. వాటా..

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, 'ఆర్యవైశ్యుల్లో చాలా మంది పేదలు ఉంటారు. కానీ, వారు తమ పేదరికాన్ని కడుపులో దాచుకొని.. సమాజంలో గౌరవం, ఆత్మాభిమానంతో బతుకుతారు. సౌమ్యంగా ఉంటారు' అని అన్నారు. బ్యాంకులు, ఇతర సంస్థలు ఏదైనా ఆస్తిని తనఖా పెట్టనిదే రుణం ఇవ్వవని, కానీ.. ఊరిలో ఉన్న ఏ పేదవాడు వచ్చినా తినడానికి అవసరమైన వస్తువులను ఆర్యవైశ్యులు ఉదారంగా ఇస్తారని తెలిపారు.ఏ గ్రామమైనా, బస్తీ అయినా ప్రశాంతంగా ఉందన్నా, పేదవాడి ఆకలి తీరుతుందన్నా.. ఎలాంటి తనఖా లేకుండా ఆర్యవైశ్యులు అప్పులు ఇవ్వడం వల్లేనన్నారు. "పేదవాడి ఆకలి తీర్చడాన్ని మీరు బాధ్యతగా భావిస్తారు. పేదలతో మీకు ప్రత్యేక అనుబంధం ఉంటుంది. ఊరిలో అందరూ మీ వద్దకు వచ్చి సాధక బాధకాలు చెబుతారు. మీ సలహా కూడా అడుగుతారు. వ్యాపారంలో ఎన్ని ఒడిదొడుకులు, ఆటుపోట్లు ఎదురైనా ఎలా అధిగమించాలో ఆర్యవైశ్యులకు తెలుసు. నేనెప్పుడూ మీ శ్రేయోభిలాషినే" అని రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని, మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు గల్లాపెట్టె పెత్తనం వారికే ఇచ్చారని చెప్పారు. తమ సొమ్ము కంటే జాగ్రత్తగా, పొదుపుగా వ్యవహరించడంతోపాటు.. ఆర్థిక వ్యవస్థను అదుపులో పెట్టి అద్భుతంగా పదవులు నిర్వర్తించారని తెలిపారు.**ధనిక రాష్ట్రంలో రోశయ్య పాత్ర..** 2014 జూన్ 2న రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఆవిర్భవించిందంటే.. 16 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రోశయ్య ఆర్థిక మంత్రిగా ఉండడమూ ఒక కారణమని సీఎం రేవంత్ అన్నారు. సీఎంలు మారినా.. ఆర్థిక మంత్రిగా రోశయ్యను కొనసాగించడం చూస్తేనే ఆర్థిక వ్యవహారాల్లో ఆర్యవైశ్యులు ఎంత నిక్కచ్చిగా ఉంటారో తెలుస్తోందన్నారు. రోశయ్యను మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా చేసి కాంగ్రెస్ పార్టీ గౌరవించిందని తెలిపారు. "2007లో నేను మొదటిసారి శాసనమండలికి వెళ్లినప్పుడు కొన్ని విషయాలపై దూకుడుగా మాట్లాడితే.. సభ ముగిసిన అనంతరం రోశయ్య పిలిపించుకొని ఆవేశం తగ్గించుకొని.. అనుభవం తోడు చేసుకొని మాట్లాడితే రాజకీయాల్లో మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు.దీర్ఘకాలిక రాజకీయాలు ఎలా చేయాలో అలవరుచుకుంటే.. తిరుగులేని నాయకుడిగా ఎదుగుతావు అని నన్ను మొదట గుర్తించింది రోశయ్యే' అని రేవంత్‌రెడ్డి చెప్పారు. రోశయ్యతో అసెంబ్లీలో సంవాదం నడిచేదని, ఆయన విమర్శలు చురకలా ఉండేవని, ఎవరినీ దూషించేవారు కాదని అన్నారు. రాష్ట్రం విడిపోయినా.. ఆయన మర్యాదను, గౌరవాన్ని కాపాడాలనే ఉద్దేశంతో నగరం నడిబొడ్డున స్థలం కేటాయించి విగ్రహం పెట్టామని తెలిపారు. అయితే ఏపీకి చెందిన రోశయ్య విగ్రహం హైదరాబాద్‌లో ఎలా పెడతారంటూ చాలా మంది విమర్శలు చేశారని అన్నారు. కానీ, "ఓ సమావేశంలో రోశయ్య మాట్లాడుతూ తాను ఆ గ్రామం నుంచి, ప్రాంతం (ఏపీ) నుంచి అన్నీ అమ్ముకొని బల్కంపేటకు వచ్చి నాలుగు దశాబ్దాలు అయిందని చెప్పారు. తాను హైదరాబాదీనే అని, మంచైనా, చెడైనా ఇక్కడేనని అన్నారు" అని సీఎం రేవంత్ వివరించారు.**ప్రపంచస్థాయి నాయకుడు మీ వాడే..** సాధారణంగా జిల్లా, ప్రాంతం, రాష్ట్ర, దేశ నాయకులను చూస్తామని, కానీ.. ప్రపంచ స్థాయి నాయకుడు ఒకే ఒక్కడు మహాత్మా గాంధీ అని సీఎం రేవంత్ అన్నారు. భారతదేశం నుంచి ప్రపంచ స్థాయి నాయకుడు ఎవరనే చర్చ వస్తే.. అది ఆర్యవైశ్యుల బిడ్డ గాంధీ అని చెప్పాల్సిందేనన్నారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ పార్టీ అని, జాతీయ అధ్యక్షుడిగానూ ఆయన బాధ్యతలు నిర్వర్తించారని చెప్పారు. ఇక ఏఐసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన సీతారాం కేసరి, ఉమ్మడి ఏపీలో పీసీసీ అధ్యక్షుడిగా రోశయ్య, కేంద్ర హోంమంత్రిగా సేవలందించిన నంద్యాలకు చెందిన పెండెకంటి వెంకటసుబ్బయ్య ఆర్యవైశ్యులేనని గుర్తు చేశారు.లాలా లజపతిరాయ్, సీతారాం కేసరి, పొట్టి శ్రీరాములు వంటి గొప్ప వ్యక్తులు ఆర్యవైశ్య సమాజం నుంచి ఉన్నారని గుర్తు చేశారు.

టెక్నాలజీపై గుత్తాధిపత్యం ప్రమాదకరం

అందుకే సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడంలో మేము అందరినీ కలుపుకొని వెళతాం' అని చెప్పారు. ప్రపంచంలో ఉద్రిక్తతలు నిరంతరం పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ అవి సాధారణ ప్రజల జీవితాలపై ప్రతికూ ల, విస్తృత ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. **సంక్షోభాలు ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కావడం లేదు** మహమ్మారులు, వాతావరణ విపత్తులు, సరఫరాలకు అంతరాయాలు...ఇలా ఏ సంక్షోభం ఎదురైనా అది ఒకే ప్రాంతానికి పరిమితం కావడం లేదని ప్రధాని అన్నారు. 'అందువల్లనే కష్టాలను తట్టుకొని నిలబడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రాధాన్యత ఇచ్చాము. సవాళ్లను సకాలంలో గుర్తించడం, వాటికి సిద్ధమవడం, తక్షణ చర్యలు తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. అంటు వ్యాధుల నివారణ కోసం బ్రిక్స్‌లో ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ఏర్పాటుపై అంగీకారం కుదిరింది. హెచ్చరికల డేటాకు సంబంధించిన మార్గదర్శకాలను సిద్ధం చేశాము. బ్రిక్స్ సహకార వ్యవస్థ మన సరఫరాలను మరింత విశ్వసనీయంగా మారుస్తుంది' అని ఆయన వివరించారు. ప్రపంచ సంక్షోభాల నివారణ కోసం నిర్ణయాలు తీసుకోవడంతో గ్లోబల్ సౌత్ దేశాలు వెనుకబడుతున్నాయని చెప్పారు. ఈ దేశాలు నిబంధనలను పాటించేవిగా ఉండకూడదని, వాటిని రూపొందించేవిగా ఎదగాలని ఆకాంక్షించారు. అభివృద్ధి కోసం కృషి చేసే సమయంలో పర్యావరణానికి హాని కలిగించవద్దని మోడీ సూచించారు. **మానవాభివృద్ధి, పర్యావరణం మధ్య సమతుల్యత అవసరం** మానవాభివృద్ధి, పర్యావరణం మధ్య సమతుల్యతను కాపాడుకోవాల్సిన అవసరముందని ప్రధాని నొక్కిచెప్పా రు. సుస్థిరతకు ఇదే పునాది అని,ఆ దిశగా భారత్ అనేక కార్యక్రమాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. స్మార్ట్ గ్రిడ్లు, ఇంధన నిల్వకోసం బ్రిక్స్ డిజిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపించామన్నారు. బ్రిక్స్‌కు అధ్యక్షత వహిం చి ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత,స్థితిస్థాపకత అనే నాలుగంశాలపై తమ ప్రయత్నాలను కేంద్రీకరించామని, సభ్యదేశాల సహకారం, మద్దతుతో ఉమ్మడి దృక్పథాన్ని అందరికీ ప్రయోజనకరమైన సహకారంగా మార్చగలగడం తనకు సంతోషాన్ని కలిగించిందని మోడీ చెప్పారు.**సహకారంలో అందరినీ భాగస్వాములను చేయాలి** ఆవిష్కరణల విభాగంలో బ్రిక్స్ ఇంక్యుబేటర్ వ్యవస్థ సభ్యదేశాల స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లను అనుసంధానిస్తుందని మోడీ తెలిపారు. వినూత్నమైన, విస్తరించదగిన పరిష్కారాలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు.

పదవి అలంకారమే..ప్రజల కోసం పనిచేస్తా...

వరంగల్, సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్): మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసినందుకు బాధ లేదని, అకారణంగా తొలగించినందుకే బాధగా ఉందని మాజీ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం వరంగల్ బస్టాండ్ సమీపంలోని ఎంకే నాయుడు హోటల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కొండా సురేఖతో పాటు ఆమె భర్త మురళి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ నవీన్ ఎప్పుడూ



స్థానికంగా ఉండాలనేవాడని, ఇప్పుడు అతని కోరిక తీరిందని, ప్రజల మధ్య ఉండి అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామన్నారు. మేం నమ్మిన వైఎస్ కోసం గతంలో మంత్రి పదవికి రాజీనామా చేశామన్నారు. కొందరు వార్డు మెంబర్ పదవికి కూడా రాజీనామా చేయడం లేదన్నారు. ఎప్పుడూ అధికార పార్టీకి రాజీనామా చేసి ప్రతిపక్ష పార్టీలో చేరేవారమన్నారు. గతంలో కొందరు గుంట నక్కలు మాకు టికెట్ దక్కకుండా చేశాయన్నారు. కాంగ్రెస్ లో టికెట్ రాకపోతే కేసీఆర్ పిలిచి మంత్రిని ఓడించడానికి వరంగల్ తూర్పులో పోటీ చేయాలని చెప్పారన్నారు. అందుకే పరకాల నుంచి వచ్చి ఇక్కడ పోటీ చేసి యాభై వేల పైచిలుకు మెజారిటీతో గెలిచానని గుర్తుచేశారు. వరంగల్ తూర్పులో మేం గెలిచినందుకే ప్రజలు ప్రశాంతంగా ఉన్నారన్నారు. కొండా మురళీ ఉన్నారనే ధైర్యంతో ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఆయన తమ్ముడు, కొడుకు భూకబ్జాలు చేశారని, షాపుల్లో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కార్పొరేటర్ గా గెలవలేనోడు నా రాజీనామా కోరుతున్నాడని ఎద్దేవా చేశారు. 32 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎంపీపీ నుంచి మంత్రి వరకు ఎన్నో రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొని ఎదిగానన్నారు. బరిలో నిలిచిన ప్రతి చోట మురళీ వెనుక ఉండి నడిపించారన్నారు. ఇప్పుడు అవకాశవాద రాజకీయాలు ఎక్కువయ్యాయని, ఏ సమయంలో ఏ పార్టీలో ఉంటారో తెలియడం లేదన్నారు. కొండా దంపతులు కాంగ్రెస్ ను వీడి వేరే పార్టీల్లో చేరుతున్నారని మీడియాలో కథనాలు వస్తున్నాయని వాటిని నమ్మొద్దని పార్టీలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. మళ్లీ వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానన్నారు. డీలిమిటేషన్ జరిగితే తప్ప ఆమెనే పోటీ చేస్తానన్నారు. రాహుల్ లక్ష్యం బీసీలను అభివృద్ధి చేయాలనేనని తెలిపారు. కొండా మురళీకి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మెన్ పదవి వచ్చే అవకాశం ఉందని సురేఖ సూచనప్రాయంగా తెలిపారు. పరకాల నియోజక వర్గంలోని తండాల్లో రూ. 7.50 కోట్లతో రోడ్ల నిర్మాణానికి జీఓ తెచ్చానన్నారు. **రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం..: కొండా మురళీ** రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యమని, కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్సీ, సురేఖ భర్త కొండా మురళీ తెలిపారు. పదవులు వస్తాయి, పోతాయని, కానీ, మాట మీద నిలబడాలన్నారు. 24 డివిజన్ లలో కార్పొరేటర్లను గెలిపించుకుంటామన్నారు. ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు రాజీనామా చేస్తున్నామని స్వామి గౌడ్ అడిగారని, నచ్చకపోవడం వల్లే అని చెప్పి రాజీనామా చేశానన్నారు. నా మాట, సురేఖ మాట ఒక్కటే ఉంటుందని, నా బిడ్డ మాట మాత్రం వేరన్నారు. ఎక్కడన్నా కొండా మురళీ భూ కబ్జాలు చేశాడని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. కార్యకర్తలే మా బలం, మా ఊపిరి అన్నారు. **కొండా సురేఖకు మంత్రి పదవి ఇవ్వాలి : వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు** కొండా సురేఖకు మళ్లీ మంత్రి పదవి ఇవ్వాలని వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. బీసీ మహిళా నేతను బర్తరఫ్ చేయడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మీసాల ప్రకాష్, నవీన్ రాజ్, మాజీ కార్పొరేటర్లు చింతాకుల అనిల్, కేడెల పద్మ, దామోదర్ యాదవ్, భోగి సువర్ణ ప్రవీణ్, బస్వరాజ్ కుమార్, బత్తిని వసుంధర, నాగపురి కల్పన, వీరగోని రాజ్ కుమార్, ముజీబ్, అక్తర్ పాల్గొన్నారు.

పండుగ రోజే విచారణకు పిలుపు!



హైదరాబాద్ సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్): రేవంత్ సర్కార్ క క్షపూరిత ధోరణి పరాకాష్టకు చేరింది. సోమవారం వినాయక చవితి రోజున పోలీస్ విచారణకు హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ, పీఆర్వోకు సైఫాబాద్ పోలీ సులు నోటీసులు ఇవ్వడమే అందు కు నిదర్శనం. ఈ నెల 7న అసెంబ్లీ మూడో గేట్ వద్ద జరిగిన ఘటనలపై కేటీఆర్ పీఏ మహేందర్‌రెడ్డి, పీఆర్వో మహేశ్‌పై కేసు నమోదైంది.వారు హైకోర్టును ఆశ్రయించడంతో మ ధ్యంతర బెయిల్ మంజూరు చేసి వి చారణకు సహకరించాలని సూచించింది. పనిదినాలను కాదని పండుగరోజే విచారణకు పిలువడం అనుమానాలకు తావిస్తున్నది. సోమవారం ఉదయం 10 గంటల కు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పీఏ మహేందర్‌రెడ్డి, పీఆర్వో మహేశ్ విచారణకు హాజరుకానున్నారు. రేవంత్ అధికా రం చేపట్టినప్పటి నుంచి ఇదే విపరీత ధోరణి అవలంబిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పల్నాడు జిల్లాలో విషాదం .. పిడుగుపాటుకు నలుగురు మృతి

అమరావతి సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్): ఏపీలోని పల్నాడు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై నలుగురు మృతి చెందారు. ఏపీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోటు ఈదురుగాలులు, పిడుగుల పడుతున్నాయి.నరసరావుపేట నియోజకవర్గంలో పిడుగుపాటుతో నాగమ్మ, వెంకాయమ్మ, వెంకటయ్య, చిన్న కోటేశ్వరావు అనే నలుగురు మృతి చెందారు. ఈ ఘటనలో మూడు ఆటోలు,కొబ్బరి, మామిడి చెట్లు దెబ్బతిన్నాయి .

మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

అమరావతి, సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్):వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా జరుపుకోవాలని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. దేశ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని దైవ స్వరూపంగా భావించి.. నదులు, వృక్షాలు, పర్వతాలు, జీవరాశులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని పేర్కొన్నారు. తొలి పూజలందుకునే వినాయకుడి అర్చనలో ఉపయోగించే పత్రి, పుష్పాలు వృక్ష సంపదతో, ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని చాటుతాయని అన్నారు.**పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు..** వినాయకచవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలకు పిలుపునిచ్చారు. సంప్రదాయబద్ధంగా మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని సూచించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

మెగా డీఎస్సీలో భారీ స్కామ్..

(మొదటి పేజీ తరువాయి)

జగన్ నిలదీశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పలు ప్రశ్నలు సంధించారు.జగన్ తన పోస్టులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఒక అభ్యర్థికి 65 టెట్ మార్కులు వచ్చాయి. ఏడు దశల వెరిఫికేషన్ తర్వాత ఉద్యోగం కేటాయించారు. అయితే ఆ తర్వాత అదే అభ్యర్థి అనర్హుడని డీఈవో నిర్ధారించారని తెలిపారు. అలాంటప్పుడు ఆ ఏడు దశల వెరిఫికేషన్‌లో ఏం జరిగిందని ప్రశ్నించారు. తనకు ఉద్యోగం ఎలా వచ్చిందో తెలియదని అభ్యర్థే చెప్పిన విషయాన్ని కూడా జగన్ ప్రస్తావించారు.విమర్శలు వెల్లువెత్తిన తర్వాత ఆ అభ్యర్థికి 2018 టెట్‌లో 77 మార్కులు వచ్చాయని అధికారులు చెప్పడంపై జగన్ సందేహాలు లేవనెత్తారు. ఆ మార్కులు ముందే ఉంటే.. డీఈవో ఎందుకు అనర్హుడని ప్రకటించారని ప్రశ్నించారు. అంతేకాకుండా ఆ 77 మార్కులు ఎస్‌జీటీ పోస్టుకు అవసరమైన పేపర్-1-A కు బదులుగా, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పేపర్-11-B లో వచ్చాయని, అయినా ఎలా అర్హత కల్పించారని నిలదీశారు.2018 టెట్ స్కోర్‌తోనే ఉద్యోగానికి అర్హత ఉంటే ఆ అభ్యర్థి 2025లో మళ్లీ టెట్ ఎందుకు రాశారని జగన్ ప్రశ్నించారు. ఇన్ని మలుపుల తర్వాత ఈ నియామక ప్రక్రియను పారదర్శకంగా జరిగిందని చెప్పగలరా..? అని అన్నారు. ఇది డీఎస్సీ స్కామ్‌ను ప్రోత్సహించడం కాదా..? అని ప్రశ్నించారు. దీనికి చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని జగన్ డిమాండ్ చేశారు.

(టెట్) జూన్ 2026 ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ, ముఖ్యంగా ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. "ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు తమ అకడమిక్ నైపుణ్యాన్ని, నిబద్ధతను మరోసారి నిరూపించుకున్నారు. మీ కృషి, అంకితభావం ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని ఆయన ప్రశంసించారు.అదే సమయంలో, ఈసారి అర్హత సాధించలేకపోయిన అభ్యర్థులు నిరాశ చెందవద్దని లోకేశ్ భరోసా ఇచ్చారు. "విజయం అనేది ఒక గమ్యం కాదు, అదొక ప్రయాణం. కాబట్టి పట్టుదలతో ప్రయత్నిస్తూనే ఉండండి" అని వారికి ధైర్యం చెప్పారు. లక్ష్యసాధన కోసం కృషి కొనసాగించాలని సూచించారు.టెట్ ఫలితాలను అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ఖఙఔవీ.ఖఙఔఽటం.అఅ ద్వారా తెలుసుకోవచ్చు. దీంతో పాటు, అభ్యర్థుల సౌలభ్యం కోసం 9552300009 అనే వాట్సాప్ నంబర్ ద్వారా కూడా ఫలితాలను పొందే సదుపాయాన్ని కల్పించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసి ఫలితాలను సులభంగా చూసుకోవచ్చు. ఉపాధ్యాయ నియామకాలకు టెట్ అర్హత తప్పనిసరి కావడంతో ఈ ఫలితాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది.

2029 కల్లా ఎన్డీయే రాష్ట్రాల్లో యూసీసీ అమలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మీడియాతో మాట్లాడుతూ ట్రిపుల్ తలాక్ రద్దు, క్రిమినల్ న్యాయ వ్యవస్థలో మార్పులు, జాతీయ భద్రత సహా పలు అంశాలను ప్రస్తావించారు. కేంద్రంలోని మోదీ సర్కార్ ఉగ్రవాదం పట్ల 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తున్నట్లు చెప్పారు.మణిపూర్‌లో ఎన్ఆర్‌సీపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ముస్లిం మహిళలకు సమాన హక్కులు కల్పించేందుకు ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశామని అన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో యూసీసీని ప్రవేశపెట్టామని, 2029 లోక్‌సభ ఎన్నికల లోగా బీజేపీ నేతృత్వంలోని 21 రాష్ట్రాలు యూసీసీని స్వీకరిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. భారతీయ న్యాయ సంహిత ద్వారా ప్రభుత్వం ఈ వ్యవస్థను బలోపేతం చేసిందన్నారు. జాతీయ భద్రతపై మాట్లాడుతూ, 370 రద్దు రక్తపాతం లేకుండా జరిగిందన్నారు. మతంతో సంబంధం లేకుండా పౌరులందరికీ ఒకే విధమైన వ్యక్తిగత చట్టాలను వర్తింపజేయటమే 'యూసీసీ'.

సిఎం రేవంత్ వినాయక చవితి శుభాకాంక్షలు

హైదరాబాద్, సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్): రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని ముఖ్యమంత్రి విఘ్నేశ్వరుడుని ప్రార్థించారు. వాడ వాడల వెలిసే గణేష్ మండపాలలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని కోరారు. ఈ గణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సిఎం ఆదేశించారు. ఈ సంవత్సరం కూడా వినాయకుని మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నదని చెప్పారు.

ఆసియా కప్ గెలిచిన టీమిండియా

(మొదటి పేజీ తరువాయి)

భారత అమ్మాయిల జోరు ముందు లంక జట్టు ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. 184 పరుగుల లక్ష్యఛేదనలో 111 పరుగులకే ఆలౌట్ అయింది.టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. లంక బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 12.5 ఓవర్లలోనే 129 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి భారీ స్కోరుకు బలమైన పునాది వేశారు. షఫాలీ 39 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 68 పరుగులు చేయగా, స్మృతి 39 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 59 పరుగులు సాధించింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు వేగంగా ఆడటంలో కాస్త తడబడినప్పటికీ, చివర్లో కమలిని కేవలం 5 బంతుల్లోనే ఓ ఫోర్, సిక్సర్‌తో 15 పరుగులు చేసింది. దీంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 183 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.అనంతరం 184 పరుగుల భారీ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే గట్టి దెబ్బ తగిలింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు లంక బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కెప్టెన్ చమరి అటపట్టు (36) కాసేపు పోరాడినా, ఆమె ఔటయ్యాక లంక పతనం వేగవంతమైంది. ముఖ్యంగా, యువ స్పిన్నర్ శ్రీ చరణి తన అద్భుత బౌలింగ్‌తో లంక బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చింది. కీలకమైన హర్షిత, నీలాక్షిక, కవిష, సుగంధికల వికెట్లను పడగొట్టి లంకను కోలుకోలేని దెబ్బ తీసింది. కేవలం 20 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టిన శ్రీ చరణికి, 3 వికెట్లు తీసిన దీప్తి శర్మ చక్కటి సహకారం అందించింది. దీంతో శ్రీలంక జట్టు సరిగ్గా 20 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ విజయంతో భారత మహిళల జట్టు ఆసియా కప్‌ను గర్వంగా ముద్దాడింది.టీమిండియా మహిళల జట్టు ఇప్పటివరకు మొత్తం 8 సార్లు ఆసియా కప్ టైటిల్‌ను గెలుచుకుంది. అందులో వన్డే ఫార్మాట్ లో 4 సార్లు, టీ20 ఫార్మాట్ లో 4 సార్లు టైటిల్ గెలిచింది. వన్డే ఫార్మాట్: 2004, 2005-06, 2006, 2008టీ20 ఫార్మాట్: 2012, 2016, 2022, 2026ఓవరాల్ గా 10 సార్లు ఫైనల్‌కు చేరిన భారత జట్టు 8 సార్లు ఛాంపియన్‌గా నిలవగా, మరో రెండు సార్లు రన్నరప్‌గా నిలిచింది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

నిరుపేద కుటుంబం లో వెలుగులు నింపిన డి ఎస్సీ

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 13 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఒక నిరుపేద కుటుంబానికి ఒకే ఇంటి లోని అక్క చెల్లెలు ఇద్దరినీ కూటమి ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ వరించింది.

ఆళ్లగడ్డలోని సామెల్ వీధిలో నివాసం ఉండే ఉమా, పావని అనే ఒకే ఇంటిలోని అక్కచెల్లెళ్లకు డీఎస్సీ వరించడంతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్వయంగా వారి ఇంటికి వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపిన వివరాల మేరకు శశిరేఖ అనే మహిళకు నలుగురు కుమార్తెలు. అందులో ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా, మరో ఇద్దరికి వివాహం కాలేదు. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ లో మానస, ఉమా, పావని అనే ముగ్గురు అక్క చెల్లెలు డీఎస్సీ రాయగా, అందులో ఉమా, పావని ఇద్దరినీ డీఎస్సీ వరించింది. మరో సోదరి మానస కేవలం మూడు పాయింట్లు తగ్గడంతో ఉత్తీర్ణురాలు కాలేకపోయింది. ఈ కుటుంబానికి ఆస్తులు అంతస్తులు పక్కన పెడితే సొంత ఇల్లు కూడా లేదు. కనీసం తండ్రి సపోర్టు కూడా లేని ఈ నలుగురు అక్క చెల్లెలు తల్లితోపాటు కూలి పనులకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో



చదువుకొని, అదే కూలి డబ్బులతో కాలేజీ ఫీజులు కట్టుకొని, చిన్నపిల్లలకు ట్యూషన్ లు చెప్పుకుంటూ స్వయంగా డీఎస్సీ ప్రిపేర్ అయి డీఎస్సీ రాసిన ఒకే ఇంట్లోని ఈ ఇద్దరు అక్క చెల్లెళ్లు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఓ నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కచెల్లెళ్లను డీఎస్సీ వరించడంతో దెబ్బకు వారి జీవితాలు మారిపోయాయని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు కన్నీటి పర్వంతంగా కృతజ్ఞతలు తెలిపారు. బాగా కష్టపడి చదివి డీఎస్సీలో ఉత్తీర్ణులై ఉద్యోగాలు సాధించిన వారు చాలామంది ఉన్నారని, ఉత్తీర్ణులు కాలేని వారికోసం మళ్లీ డీఎస్సీ వదులుతారని, అందరూ మళ్లీ డీఎస్సీ రాసేందుకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే తెలిపారు. వైసిపి వాళ్లకు



సాధ్యం కాలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాకు సాధ్యమైందని మొట్టమొదటి సంతకం చంద్రబాబు నాయుడు డీఎస్సీ ఫైల్ పైనే పెట్టడం జరిగిందని, కష్టపడిన వారందరికీ ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఇలా కష్టపడి ఉద్యోగాలు సాధించిన డీఎస్సీ అభ్యర్థుల గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యేలు చూస్తూ ఊరికే కూర్చొమని భూమా అఖిలప్రియ హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం చెప్పినవన్నీ చేసుకుంటూ పోతున్నామని, డీఎస్సీ సాధించిన అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అభినందనలు తెలిపారు.

గుత్తిలో ఉచితంగా 550
మట్టి వినాయక విగ్రహాల పంపిణీ..



గుత్తి సెప్టెంబర్ 13 (రిపబ్లిక్ న్యూస్)

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజాం సోషల్ సర్వీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రమీజా కంప్యూటర్ ఇన్స్టిట్యూట్, గుత్తి సహాయ సహకారాలతో పట్టణంలోని ప్రజలకు 550 స్వచ్ఛమైన మట్టి వినాయక విగ్రహాలను నిజాం సోషల్ సర్వీస్ ఫౌండేషన్ కమిటీ నిజాం, రమేష్, రంగా అధ్యక్షతన ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుత్తి టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకే చౌదరి హాజరై వినాయక విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యఅతిథి ఎంకే చౌదరి మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించడం వల్ల విగ్రహాలు సహజంగా నీటిలో కలిసిపోయి కాలుష్యాన్ని తగ్గించేందుకు దోహదపడతాయని తెలిపారు. ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందించడం ద్వారా పర్యావరణహితమైన వినాయక చవితిని ప్రోత్సహించడంతో పాటు, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం ఎంతో ఆనందకర విషయం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సేవాభావంతో పాల్గొన్న విద్యార్థులు, యువత, భక్తులు, ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యఅతిథికి సన్మానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో నిజాం సోషల్ సర్వీస్ ఫౌండేషన్ సభ్యులు అఖిల్, చాంద్ బాషా, అనిల్, టిడిపి నాయకులు రామకృష్ణ, లక్ష్మణ్, గోవర్ధన్, విద్యార్థులు , రమీజా కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు, ప్రజలు , తదితరులు పాల్గొన్నారు.

గోవులను వీధులలోకి వదలొద్దు

జంతు సంరక్షణ ప్రేమికుడు డాక్టర్. వి. శ్రీనివాసులు

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 13 రిపబ్లిక్ న్యూస్

ఆళ్లగడ్డ పట్టణంలోని గోవుల, లేగదుడల, బసవన్నల యజమానులుఅందరూ వాటిని పట్టణం లోని రోడ్ల మీదికి వదలవద్దని.వాటిని మీ ఇంటిదగ్గరే సంరక్షించుకోవాలని కోరుతూ అనిమల్ ప్రొటెక్షన్ ఆర్గనైజర్ ప్రముఖ జంతు ప్రేమికుడు బృందావనం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈపనగుండ్ల శ్రీనివాస యాదవ్ ఆదివారం రోజు ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీపన గండ్ల. శ్రీనివాసులు మాట్లాడుతూ గోవులను బసవన్నలను వీధులలో వదులుతున్న వారికి అవగాహన కల్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని మీడియా ముఖంగా కోరారు. గోవులను బసవన్నలను వాటి యజమానులు వీధులలోకి వదులుతున్న కూడా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జంతువుల యజమానులు వాటిని పోషించే స్తోమత లేనప్పుడు



వాటిని ఇతరులకు దానం చేయడం లేదా గోశాలకు తరలించేలా మున్సిపల్ అధికారులు గోవుల యజమానులకు అవగాహన కల్పించాలని కోరారు. లేదా గోపోషణ చేయలేని యజమానులు వాటిని రోడ్లపై విడిచి వేయడంతో అవి సినిమా వాల్ పోస్టర్లు పాలిథిన్ కవర్లు తింటూ అనారోగ్యానికి గురి కావడం లేదా వాహనాల కింద వచ్చి మరణించడం లాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు పోలీసు

వారికి సమాచారం అందించిన సరైన చర్యలు చేపట్టకపోవడంతో తాను ఈ నిరసన దీక్ష చేపడుతున్నానని ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో ఇతర ప్రజా సంఘాలు సామాజిక బాధ్యత కలిగిన పౌరులతో కలిసి మరిన్ని కార్యక్రమాలను రూపొందించడం జరుగుతుందని.అలాగే గో యజమానులు వాటి సంరక్షణ చేపట్టకపోతే వారిపై కూడా పోలీసు వారికి ఫిర్యాదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.తానేమీ గోవుల యజమానులకు వ్యతిరేకం కాదని తాను స్వతహాగా జంతు ప్రేమికిడిని అని మూగ జీవిలైన ఆవులు, దూడలు అలా రోడ్ల మీద ఇబ్బంది పడుతూ ఉంటేచూడలేకనే ఇలా నిరసన దీక్ష చేయాల్సి వచ్చిందని ఈ నిరసనను గోవుల ఎజమానులు మున్సిపల్ అధికారులు ఆళ్లగడ్డ పట్టణ ప్రజలు అర్థం చేసుకోవాలని డాక్టర్ వీపన గండ్ల శ్రీనివాసులు కోరారు .కాగా మూగ జీవుల రక్షణ కోసం నిరసన దీక్ష చేస్తున్న డాక్టర్ వీపానగాండ్ల శ్రీనివాసుల యాదవ్ కు పలువురు పుర ప్రముఖులు, విద్యా వేత్తలు సంఘీభావం తెలిపి మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గుత్తి ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

గుత్తి సెప్టెంబర్ 13 (రిపబ్లిక్ న్యూస్)



బండల రామాంజనేయులు



పిట్ల చిరంజీవి

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గుత్తి పట్టణ ప్రజలకు బండల రామాంజనేయులు, వడియా రాజుల సంఘం అధ్యక్షుడు పిట్ల చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించి, పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని ప్రజలందరూ పరస్పర స్నేహభావంతో, ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని సూచించారు. గణనాథుడి కృపాకటాక్షాలతో ప్రజల జీవితాల్లో ఎదురయ్యే విఘ్నాలు తొలగిపోయి, ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. పట్టణ ప్రజల కుటుంబాల్లో ఆనందం, శాంతి, సౌభాగ్యం నెలకొనాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల ఫైనల్ లిస్ట్ మున్సిపల్ కార్యాలయం లో
ప్రదర్శించిన మున్సిపల్ కమిషనర్ కిషోర్

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 13 రిపబ్లిక్ న్యూస్



ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ కిషోర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోవు స్థానిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్లను ఇదివరకే అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోని నోటీసు బోర్డుల యందు ప్రదర్శించడం జరిగిందని సదరు పోలింగ్ స్టేషన్లో ఎటువంటి అభ్యంతరాలు రానందువలన ఈరోజు ఆళ్లగడ్డ పురపాలక సంఘం కార్యాలయము నందు మరియు ఇతర ప్రభుత్వ కార్యాలయాల యందు పోలింగ్ కేంద్రాల ఫైనల్ లిస్టులు ఈరోజు నోటీసు బోర్డుల యందు ప్రదర్శించడం జరిగినదని కమిషనర్ తెలిపారు..

నంద్యాల జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల భవిష్యత్తు వ్యూహంపై కీలక చర్చ.

పాల్గొన్న కో ఆర్డినేషన్ సభ్యురాలు మైలేరి సురేఖ

ఆళ్లగడ్డ సెప్టెంబర్ 13 రిపబ్లిక్ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం పై ఈరోజు నంద్యాల ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నంద్యాల పార్లమెంట్ జనసేన పార్టీ కోఆర్డినేటర్ యనమల భాస్కర్ , కోఆర్డినేషన్ సభ్యులుపసుపులేటి సంజీవ,ఆళ్లగడ్డ కు చెందిన మైలేరి సురేఖ, రాచమడుగు సుందర్ పాల్గొన్నారు.నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ వైకుంఠం ప్రభాకర్ చౌదరి, నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గౌరు చరిత, నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో



జనసేన పార్టీ విజయమే లక్ష్యంగా భవిష్యత్తు వ్యూహం, పటిష్టమైన కార్యాచరణ, క్షేత్రస్థాయి సమన్వయం, పార్టీ శ్రేణుల భాగస్వామ్యం తదితర కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.గ్రామస్థాయి



నుంచి నియోజకవర్గ స్థాయి వరకు సమన్వయంతో ముందుకుసాగుతూ.కూటమి విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలనే సంకల్పంతో సమావేశం కొనసాగింది.

1000మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసిన ఆవుల విజయ భాస్కర్ రెడ్డి



ఆళ్లగడ్డ సెప్టెంబర్ 13 రిపబ్లిక్ న్యూస్



ఆళ్లగడ్డ పట్టణం లోని ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో రేపు సోమవారం వినాయక చవితి పండగ సందర్భంగా ఈరోజు ఆదివారం సాయంకాలం శ్రీ ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి వారు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టితో చేసిన1000 వినాయక ప్రతిమలను ఆళ్లగడ్డ పరిసర ప్రాంత ప్రజలకు ఆళ్లగడ్డ గణేష్ ఉత్సవ కేంద్ర సమితి అధ్యక్షులు శ్రీ ఆవుల విజయభాస్కర్ రెడ్డి శ్రీమతి లలిత రెడ్డి వారి చేతుల మీదుగా ఉచితముగా పంపిణీ చేయడం జరిగినది,ఈ కార్యక్రమం లో పుల్లయ్య,దామోదర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణయ్య, రామసుబ్బయ్య,నాగరాజు, రామాచారి, ముని, రామకృష్ణ,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

పారామెడికల్ విద్యార్థుల పోరాటంపై పోలీసుల దాడిని ఖండించిన సీపీఎం -15 వేల స్టైఫండ్ కు డిమాండ్.

రైల్వే కోడూరు సెప్టెంబర్ 13 రిపబ్లిక్ న్యూస్.



పారామెడికల్ విద్యార్థులు తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా చేస్తున్న పోరాటంపై పోలీసులు దాడి చేసి, దౌర్జన్యంగా, దుర్మార్గంగా, అన్యాయంగా,అమానుషంగా, అమానవీయంగా, వ్యవహరించడాన్ని సీపీఎం తిరుపతి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది,అలిపిరి సమీపంలో పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు విమర్శించారు. విద్యార్థినులని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని లాగడం, భుజాలపై అదిమిపెట్టి తరలించడం వంటి హేయమైన చర్యలు బాధాకరమన్నారు.నేడు సీపీఎం జిల్లా కమిటీ మీడియాతో మాట్లాడుతూ మాట్లాడుతూ, గత పది రోజులుగా పారామెడికల్ విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. రోజుకు 12 గంటల పాటు సేవలు చేయించుకుంటూ కనీసం ఒక్క రూపాయి కూడా స్టైఫండ్ ఇవ్వకపోవడం సరికాదన్నారు. తక్షణమే పారామెడికల్ విద్యార్థులకు నెలకు రూ.15,000 స్టైఫండ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.నర్సింగ్ విద్యార్థులకు, ఎంబీబీఎస్ హౌస్ సర్జన్లకు, పీజీ విద్యార్థులకు స్టైఫండ్ ఇస్తున్న ప్రభుత్వం సమానమైన సేవలు అందిస్తున్న పారామెడికల్ విద్యార్థులకు మాత్రం స్టైఫండ్ ఇవ్వకుండా వివక్ష చూపడం ఎంతవరకు సమంజసం అన్నారు,ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి ఈ సమస్యపై బాధ్యతాయుతంగా స్పందించి తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆందోళన ముగించుకుని ప్రశాంతంగా తమ టెంట్ వద్దకు వెళ్తున్న విద్యార్థులను పోలీసులు మధ్యలో అడ్డుకుని, భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. విద్యార్థుల సమస్యలను చర్చించి పరిష్కరించాల్సిన ప్రభుత్వం, పోలీసుల ద్వారా వారిని అడ్డుకోవడం సమస్యను మరింత జఠిలం చేస్తుందని అన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల న్యాయమైన పోరాటాన్ని నిర్బంధాలతో ఆపలేరని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని వందవాసి నాగరాజు కోరారు. పారామెడికల్ విద్యార్థులకు స్టైఫండ్ మంజూరు చేయకపోతే అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని సీపీఎం స్పష్టం చేసింది.ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు, కందారపు మురళి.టి. సుబ్రహ్మణ్యం, ఎస్. జయచంద్ర, కే. వేణుగోపాల్, సిహేచ్. చంద్ర శేఖర్ ,బాలసుబ్రహ్మణ్యం, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/67888

దివ్యాంగ క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేత :దుర్గారెడ్డి







రైల్వే కోడూరు సెప్టెంబర్ 13 రిపబ్లిక్ న్యూస్.
దివ్యాంగ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు దుర్గా రెడ్డి కోరారు, రాజంపేటలో పారా సిట్టింగ్ క్రికెట్ క్రీడాకారులకు బోయినపల్లి ప్లే గ్రౌండ్లో క్రీడాకారులకు బ్యాట్లు, బంతులు తదితర క్రీడా సామగ్రిని దుర్గా రెడ్డి అందజేశారు. దుర్గా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడాకారులకు అవసరమైన సామగ్రి, శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించగలరని ఆయన అన్నారు, విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం అధ్యక్షుడు శుభ నర్సారెడ్డి తో కలిసి క్రీడాకారులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మల్లు సుబ్బనరసారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగ క్రీడాకారులను ప్రోత్సహించడంలో దుర్గా రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. క్రీడా సామగ్రి అందించినందుకు క్రీడాకారులు, నిర్వాహకులు దుర్గా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో వైసీపీ అన్నమయ్య జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు హుస్సేన్, రాజంపేట సేవా సంఘం అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఖాదర్ బాషా, క్రీడాకారులు మహేష్, నవీన్, రామయ్య, చిరంజీవి, ప్రసాద్, బాలాజీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల నాయకత్వాన్ని బలపరచండి

:-మాదిగ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నందిని



పాములపాడు సెప్టెంబర్ 13 రిపబ్లిక్ న్యూస్:- మందకృష్ణ మాదిగ అన్న ఆదేశాల మేరకు మండలాల పర్యటనలో భాగంగా శనివారం రోజున మండల కేంద్రమైన పాములపాడులోని, ఎస్సీ కాలనీ చర్చి దగ్గర మండల అధ్యక్షుడు రాంప్రసాద్ మాదిగ, ఎంఎస్పి మండల అధ్యక్షుడు బుల్లెద్దుల మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా– మాదిగ మహిళా సమైక్య అధ్యక్షురాలు నందిని మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ప్రేమ రాజు మాదిగ, తదితరులు హాజరు కావడం జరిగింది. అనంతరం మాదిగ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నందిని మాట్లాడుతూ మహిళల నాయకత్వం పెంపొందించే విధంగా ఉద్యమ కార్యచరణ ఉంటుంది కాబట్టి మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం మరియు. చట్టాలపై అవగాహన అవసరం అని అందుకే మహిళలు కూడా సమాజంలో జరుగుతున్న అసమానతలను గుర్తించి మహిళల హక్కుల కోసం, పోరాటాల వైపు కొనసాగాలని, ఉద్యమాలలో పాలుపంచుకొని.నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, మందకృష్ణ మాదిగ అన్న ఆశయమైనటువంటి బడుగుల రాజ్యాధికారంకోసం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలను కలుపుకొని రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా పాములపాడు మండల నూతన మహిళా కమిటీని ప్రకటించడం జరిగిందనీ ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు ప్రేమ రాజు తెలిపారు. మండల కన్వీనర్ గా నులక.భారతి మాదిగ కో కన్వీనర్ గా కర్నాటి ప్రియాంక మాదిగ, లావణ్య, దుర్గమ్మ, లక్ష్మీదేవి లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమేలమ్మ. చౌడమ్మ, సుమిత్ర, లక్ష్మీదేవి, వెంకటేశ్వరమ్మ, అనంతమ్మ, మరియమ్మ, నాగరత్నమ్మ, బాలేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి చిత్రకళకు ఫిదా

విజయనగర వైభవానికి అద్దం పడుతున్న తైలవర్ణ చిత్రాలు



శ్రీ సత్య సాయి/లేపాక్షి, సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్):శతాబ్దాల చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన లేపాక్షి ఆలయం ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. ఆలయంలో అడుగుపెట్టిన తెలంగాణ రాష్ట్ర స్థిరాస్తి నియంత్రణ ప్రాధికార సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసరాజు అక్కడి శిల్పకళ, తైలవర్ణ చిత్రాలను చూసి అబ్బురపడ్డారు. విజయనగర సామ్రాజ్య కళా వైభవం నేటికీ చెక్కుచెదరకుండా కనిపించడం విశేషమన్నారు. కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన శ్రీనివాసరాజు,అనంతరం లేపాక్షి దుర్గామాత, పాపనాశేశ్వర, వీరభద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మహామండపం పైకప్పుపై ఉన్న మహోగ్ర వీరభద్రస్వామి భారీ తైలవర్ణ చిత్రం చూపరులను కట్టిపడేస్తోందని పేర్కొన్నారు. నాటి చిత్రకారుల సృజనాత్మకత, నైపుణ్యానికి ఇది అద్భుతమైన నిదర్శనమన్నారు.

నాటి శిల్పుల అద్భుత ప్రతిభను చాటుతున్నాయి

నాట్యమండపంలో వటపత్రశాయిగా దర్శనమిచ్చే బాలకృష్ణుడి రంగుల చిత్రం ఆలయ సౌందర్యానికి మరింత వన్నె తెచ్చిందన్నారు. నేలను తాకని ఆకాశ స్తంభం, భారీ నాగలింగం, ప్రపంచ ప్రసిద్ధ లేపాక్షి బసవయ్య వంటి శిల్పాలు నాటి శిల్పుల అద్భుత ప్రతిభను చాటుతున్నాయని కొనియాడారు.ఈ సందర్భంగా చరిత్రకారుడు మైనాస్వామి లేపాక్షి ఆలయ చరిత్ర, శిల్పకళ ప్రత్యేకతలను వివరించారు. తాను రచించిన లేపాక్షి పుస్తకాన్ని శ్రీనివాసరాజు, ఆయన మిత్రబృందానికి అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ హైవేస్ సలహాదారు నయీముల్లా, ఆర్‌అండ్‌బీకి చెందిన శ్రీ సుధాకరరెడ్డి, అమరరాజాకు చెందిన విజయనాయుడు, డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్ ఎస్. రామ్మోహన్ తదితరులు పాల్గొని వీరభద్రస్వామిని దర్శించుకున్నారు.


నిఖా కార్యక్రమంలో పాల్గొన్న తల్లెం భరత్ కుమార్ రెడ్డి.



రైల్వే కోడూరు సెప్టెంబర్ 13 రిపబ్లిక్ న్యూస్.
రాజా రాణి మహల్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం మధ్యాహ్నం కోడూరు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అబ్దుల్ ముజీబ్ కుమారునినిఖా కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాయలసీమ జోన్ బూత్ కమిటీ కన్వీనర్, గుంతకల్లు రైల్వే బోర్డు డి ఆర్ యు సి సి సభ్యుడు తల్లిని భర్త కుమార్ రెడ్డి పాల్గొని షాదీ ముబారక్, శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు నియోజక వర్గం వాణిజ్య విభాగ అధ్యక్షుడు గున్నిశెట్టి రమేష్,సాయంకాలం దినపత్రిక రైల్వే కోడూరు ఇంచార్జ్ పాణ్యం చిన్నయ్య, సలీం, రహీం,కులయప్ప, రహమతుల్లా, ఆజం రెహమాన్ తదితరులు పాల్గొని షాదీ ముబారక్ మరియు శుభాకాంక్షలు వారికి తెలియజేశారు.



వధు వరులు శిరీష, శివ సుబ్రహ్మణ్యం లను ఆశీర్వదించిన జనసేన ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్.





రైల్వే కోడూరు సెప్టెంబర్ 13 రిపబ్లిక్ న్యూస్.ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లె గ్రామం చెన్నై జాతీయ రహదారి అనుకొని ఉన్న టీటీడీ కళ్యాణ మండపంలో వడ్డి కృష్ణయ్య, మణెమ్మ దంపతుల ఏకైక కుమారుడు శివ సుబ్రమణ్యం , కుటాగుల జోసఫ్, లలితమ్మ దంపతుల కుమార్తె శిరీష వివాహం ఆదివారం ఘనంగా జరిగింది, వడ్డి కృష్ణయ్య మణెమ్మ కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు రైల్వే కోడూరు జనసేన పార్టీ శాసనసభ్యులు అరవ శ్రీధర్ ఈ వివాహ వేడుకలోపాల్గొని నూతన వధూవరులనుహృదయపూర్వకం గా ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు, అంతకుముందు కృష్ణయ్య దంపతులు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ను మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు, అనంతరం ఏపీఎండీసీ చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్, సిపిఓ గోపీనాథ్ ఈ వివాహమునకు విచ్చేయగా ఆయనకు కృష్ణయ్య దంపతులు స్వాగతం పలికారు ఆయన నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ కార్యక్రమం లో ముక్కా మధుసూదన్ రెడ్డి , ఎన్ డి ఏ కూటమి నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు

వైసీపీ నేతల ఫైర్
గోపాలరెడ్డిపై తీవ్ర విమర్శలు
ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందామని సవాల్



అనంతపురం ప్రతినిధి, సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్):
తోపుదుర్తి భాస్కర్ రెడ్డి వర్ధంతిలో నేతల అసమ్మతి వల్ల కట్టకిందపల్లి గోపాల్ రెడ్డి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తోపుదుర్తి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైసీపీ నాయకులు హెచ్చరించారు. రాజకీయంగా ఎదిగేందుకు గతంలో తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి అండదండలు పొందినవారే ఇప్పుడు ఆయన కుటుంబంపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. కట్టకిందపల్లి గోపాల్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. శనివారం తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైయస్సార్సీపీ నాయకులు భువనగిరి వరప్రసాద్‌రెడ్డి, నారాయణరెడ్డి, జడ్పీటీసీ చంద్రశేఖర్, బండి పవన్‌కుమార్, సత్తిరెడ్డి తదితరులు మాట్లాడారు.

ప్రజల తీర్పును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

ప్రకాశ్‌రెడ్డి రాజకీయంగా, సామాజికంగా ఎంతోమందికి అండగా నిలిచారని, రామగిరి, చెన్నేకొత్తపల్లి ప్రాంతాల్లో బోర్లు వేయడంతో పాటు పేరూరు డ్యాంకు నీరు తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఆయన సహకారంతో పదవులు, రాజకీయ అవకాశాలు పొందిన కొందరు వ్యక్తులు విశ్వాసం లేక ఇప్పుడు విమర్శలు చేయడం విశ్వాసఘాతుకమని మండిపడ్డారు. అందులో భాగంగా మార్కెట్‌యార్డు చైర్మన్ వంటి పదవులు ఎవరికి ఎలా దక్కాయో ప్రజలకు తెలుసని నేతలు వ్యాఖ్యానించారు. సిమెంట్ షాప్ నిర్వహిస్తూ కాలం గడుపుతున్న వ్యక్తికి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అక్కున చేర్చుకుని రాజకీయ పదవులు కట్టబెట్టారని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవులు పొంది అనంతరం పదవీకాలం ముగిసిన తరువాత గోపాల్ రెడ్డి తమకు 100 ఎకరాలు భూమి ఉందని చెప్పడం ఆస్యాస్పదంగా ఉందన్నారు. కేవలం 30 ఎకరాల భూమి మాత్రమే ప్రకాశ్ రెడ్డి కి ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తమరు పదవులు అనుభవించక ముందు మీ పరిస్థితి ఏందో ఒకసారి గుర్తుకు తెచ్చుకొని వ్యవహరించాలని అన్నారు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి కాలం ముగిసిన తర్వాత జీర్ణించుకోలేక ప్రకాష్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. గోపాల్ రెడ్డి వెనక కొందరు వ్యక్తులు రెచ్చగొట్టే విధంగా మాట్లాడించడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. పద్ధతి మార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదన్నారు. ప్రకాష్ రెడ్డి ఆస్తులు గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు. వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో తమకు తెలుసు అన్నారు.

ఇంటి పనిమనిషిని ఉరివేసి చంపారు

ఇంటి పనిమనిషిని చిత్రహింసలకు గురిచేసి, ఆమె ను ఉరివేసి చంపారని మీడియా ముఖంగా మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం ఎవరినైనా హత్యలు చేసేందుకు గోపాల్ రెడ్డి వెనకాడరని, ఎంతటికైనా దిగజారుతారని అన్నారు. ప్రకాష్ రెడ్డి మీరు ముగ్గురు అన్నదమ్ములు మేము ముగ్గురు అన్నదమ్ములు అంటున్నారే... ప్రకాష్ రెడ్డి ని అనే ముందు ఒక్కసారి తమరు ఏ స్థాయి నుంచి వచ్చారో ఒకసారి తిరిగి చూసుకొని ఆచితూచి మాట్లాడాలని అన్నారు. బంధువులే అయినప్పటికీ... రాజకీయంలో బంధువులు,బంధుత్వాలు పక్కనపెట్టి ప్రజాక్షేత్రంలోనే కాలర్ పట్టుకుని నిలదీసే పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరి బలమెంతో ప్రజలే నిర్ణయిస్తారని నేతలు స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామని, వారు కూడా ప్రజల తీర్పును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సవాల్ చేశారు. కనీసం వార్డు సభ్యుడిగా గెలవలేని వారు పెద్ద రాజకీయ నాయకుల మాదిరిగా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.ప్రకాశ్‌రెడ్డిని సమన్వయకర్త పదవి నుంచి తప్పించేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని నేతలు ప్రస్తావించారు. పదవుల కోసం పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తీసుకురావడం మానుకోవాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసిన నాయకుడిపై తప్పుడు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

ప్రజాక్షేత్రంలోనే సమాధానం చెబుతాం

నియోజకవర్గంలో మళ్లీ ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించే విధంగా ఉన్నారనే నేతలు మండిపడ్డారు . డబ్బుతో ప్రజలను రెచ్చగొట్టడం, నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. తోపుదుర్తి కుటుంబానికి చెందిన భూములు, ఆస్తులపై వస్తున్న ఆరోపణలను నేతలు ఖండించారు. తప్పుడు ప్రచారం కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, వ్యక్తిగత దూషణలు, అసత్య ప్రచారాలకు స్వస్తి పలకాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల తీర్పే అంతిమమని, ప్రజాక్షేత్రంలోనే సమాధానం చెబుతామని స్పష్టం చేశారు.

ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు గణవేణి నందిని మల్లేష్ యాదవ్ ని పరామర్శించిన తాజా మాజీ జడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్



మల్లాపూర్ సెప్టెంబర్ 10 (రిపబ్లిక్ న్యూస్)
ఉప సర్పంచ్ ల ఫోరం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు రేగుంట గ్రామ ఉప సర్పంచ్ గనవేని నందిని మల్లేష్ యాదవ్ తండ్రి గనవేని మల్లయ్య ఆకస్మాత్ గా మరణించిగా ఈరోజు రేగుంటలో వారి నివాసానికి వచ్చి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసిన తాజా మాజీ జడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్ మరియు దీతీం జిల్లా స్థాయి నాయకులు ఈ కార్యక్రమంలో..రేగుంట సర్పంచ్, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లు, ఎతీం పట్టణ మండల అధ్యక్షులు Brs జిల్లా నాయకులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు

గణేశుని ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి - ఎస్సై సుజన్ కుమార్.

రైల్వే కోడూరు సెప్టెంబర్ 13 రిపబ్లిక్ న్యూస్.



ఓబులవారిపల్లి మండలంలో ఉన్న అన్ని పంచాయతీలలోనూ వినాయక చవితి, గణేశుని పండుగను పురస్కరించుకొని ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు, వినాయక నిమజ్జనం వరకు వినాయక ప్రతిమల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు,గొడవలకు తావు లేకుండా ఆయా గ్రామాల ప్రజలు గ్రామాల్లో ఉన్న పెద్ద మనుషులు ఆధ్వర్యంలో. ప్రశాంతంగా వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పోలీస్ యాక్ట్ ఉన్నందున ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి పండుగలు జరుపుకోవాలని ఎక్కడైనా ఎవరైనా లేదా ప్రజలను ఇబ్బంది పెట్టిన వారిపైన పీడీ యాక్ట్ లు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/67888

విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు.

(రిపబ్లిక్ న్యూస్) ప్రత్యేక కథనం



హిందూ పండుగల్లో వినాయక చవితికి విశిష్టమైన స్థానం ఉంది. ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా వినాయకుడిని పూజించడం భారతీయ సంప్రదాయంలో ఆనవాయితీగా వస్తోంది. అందుకే గణపతిని ఆది పూజ్యుడు, విఘ్నేశ్వరుడు, గణనాథుడు, లంబోదరుడు, గజాననుడు వంటి అనేక పేర్లతో భక్తులు కొలుస్తారు. ప్రతి సంవత్సరం భాద్రపద శుద్ధ చవితి రోజున వినాయక చవితిని ఘనంగా జరుపుకుంటారు.

వినాయక చవితి కేవలం ఒక పూజా కార్యక్రమం మాత్రమే కాదు. భక్తి, జ్ఞానం, శుభారంభం, ఐక్యత, సామాజిక చైతన్యానికి ప్రతీకగా ఈ పండుగ నిలుస్తోంది.

గణపతి ఎవరు?

హిందూ పురాణాల ప్రకారం గణపతి పార్వతీ పరమేశ్వరుల కుమారుడు. గణపతికి ఏనుగు తల ఉండటం వెనుక ఒక ప్రసిద్ధ పురాణ కథ ఉంది.

ఒకసారి పార్వతీదేవి తనకు రక్షణగా ఒక బాలుడిని సృష్టించి, తాను స్నానానికి వెళ్లే సమయంలో ఎవరినీ లోపలికి అనుమతించవద్దని ఆదేశిస్తుంది. తల్లి ఆజ్ఞను పాటిస్తూ ఆ బాలుడు ద్వారం వద్ద కాపలాగా నిలుస్తాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పరమేశ్వరుడిని కూడా బాలుడు లోపలికి అనుమతించడు. దీంతో కోపోద్రిక్తుడైన శివుడు ఆ బాలుడి తలను నరికి వేస్తాడు.

తరువాత పార్వతీదేవి ఆగ్రహించడంతో, శివుడు ఏనుగు తలను అమర్చి ఆ బాలుడికి తిరిగి ప్రాణం పోస్తాడు. అనంతరం అతడిని తన కుమారుడిగా స్వీకరించి, సర్వగణాలకు అధిపతిగా, అన్ని శుభకార్యాలకు ముందుగా పూజలు అందుకునే దేవుడిగా వరమిస్తాడని పురాణ కథనం.

అందుకే గణపతిని "ప్రథమ పూజ్యుడు"గా భక్తులు ఆరాధిస్తారు.

వినాయక చవితి ఎందుకు జరుపుకుంటారు?

వినాయక చవితిని ప్రధానంగా గణపతి జన్మదినంగా భావించి జరుపుకుంటారు. భాద్రపద మాసంలోని శుక్లపక్ష చవితి రోజున గణపతి అవతరించాడని పురాణ విశ్వాసం. వినాయకుడు జ్ఞానానికి, వివేకానికి, శుభానికి ప్రతీకగా భావిస్తారు. జీవితంలో ఎదురయ్యే ఆటంకాలు తొలగిపోవాలని, కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని, విద్య, ఉద్యోగం, వ్యాపారం తదితర రంగాల్లో విజయాలు సాధించాలని భక్తులు గణపతిని ప్రార్థిస్తారు.

"వక్రతుండ మహాకాయ సూర్యకోటి సమప్రభ
నిర్విఘ్నం కురుమే దేవ శుభకార్యేషు సర్వదా"

అనే ప్రార్థనలోనూ ఎలాంటి విఘ్నాలు లేకుండా శుభకార్యాలు విజయవంతంగా పూర్తికావాలని గణపతిని ప్రార్థిస్తారు.

మట్టి వినాయకుడి వెనుక ఉన్న సందేశం

సంప్రదాయంగా వినాయక విగ్రహాలను మట్టితో తయారు చేసేవారు. పూజ అనంతరం విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా ప్రకృతిలోని మట్టి తిరిగి ప్రకృతిలో కలిసిపోతుంది.

వినాయక చవితి మనిషి జీవితం కూడా ప్రకృతిలో నుంచే పుట్టి చివరకు ప్రకృతిలోనే కలిసిపోతుందనే తాత్విక సందేశాన్ని అందిస్తుంది.

అయితే ఇటీవలి కాలంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల నిమజ్జనం అనంతరం నీటి కాలుష్యం పెరుగుతోంది. అందువల్ల మట్టి వినాయకులను ప్రోత్సహించడం, సహజ రంగులను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.

వినాయకుడికి ఇష్టమైన పత్రి ఎందుకు?

వినాయక చవితి పూజలో పత్రికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. సాధారణంగా గణపతికి 21 రకాల పత్రులు సమర్పించే సంప్రదాయం అనేక ప్రాంతాల్లో ఉంది. ఇందులో ప్రకృతిలో లభించే వివిధ రకాల ఆకులు, మొక్కలకు ప్రాధాన్యం ఉంటుంది.

పురాతన సంప్రదాయాలు ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తాయి. పండుగ సందర్భంగా మొక్కలు, చెట్లు, ప్రకృతి విలువను గుర్తించడం కూడా ఈ ఆచారాల్లోని ఒక ముఖ్యమైన సందేశంగా భావించవచ్చు.

ఉండ్రాళ్లు, కుడుములు ఎందుకు?

వినాయకుడి నైవేద్యంలో ఉండ్రాళ్లు, కుడుములు, మోదకాలకు ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా మోదకం గణపతికి అత్యంత ఇష్టమైన నైవేద్యంగా పురాణ సంప్రదాయంలో చెప్పబడుతుంది.

మోదకం జ్ఞానం, ఆనందానికి ప్రతీకగా భావించే ఆధ్యాత్మిక వివరణలు ఉన్నాయి. అందుకే వినాయక పూజలో భక్తులు మోదకాలు, ఉండ్రాళ్లు, కుడుములు తదితర నైవేద్యాలను సమర్పిస్తారు.

గణపతి ఆకారంలోనూ ప్రత్యేకతే

వినాయకుడి రూపంలోని ప్రతి అంశానికి ప్రత్యేకమైన అర్థాన్ని ఆధ్యాత్మిక సంప్రదాయాలు చెబుతాయి.

పెద్ద చెవులు మంచి మాటలను ఎక్కువగా వినాలనే సందేశం.

చిన్న కళ్ళు ఏకాగ్రతతో చూడాలనే సూచన.

పెద్ద పొట్ట జీవితంలో ఎదురయ్యే మంచి చెడులను జీర్ణించుకునే సహనం.

ఏనుగు తల జ్ఞానం, వివేకం, బలానికి ప్రతీక.

చిన్న నోరు తక్కువ మాట్లాడి ఎక్కువగా వినాలనే సందేశం. ఎలుక వాహనం కోరికలను అదుపులో ఉంచుకోవాలనే తాత్విక భావనగా వివరిస్తారు.

అందువల్ల గణపతి విగ్రహం కేవలం ఒక దేవతా రూపం మాత్రమే కాకుండా జీవన విధానానికి సంబంధించిన అనేక సందేశాలను అందించే ప్రతీకగా నిలుస్తుంది.

ఇంటింటా పూజ నుంచి సామూహిక ఉత్సవం వరకు

వినాయక చవితి సందర్భంగా ప్రజలు ఇళ్లలో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే సమయంలో గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో వివిధ ప్రాంతాల్లో సామూహికంగా గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించడం కూడా ఆనవాయితీగా మారింది.

ప్రజలు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరి భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ విధంగా వినాయక ఉత్సవాలు సామాజిక ఐక్యతకు కూడా వేదికగా మారుతున్నాయి.

స్వాతంత్ర్య ఉద్యమంలోనూ కీలక పాత్ర

వినాయక చవితి సామూహిక ఉత్సవంగా విస్తరించడంలో మహారాష్ట్రలోని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు బాల గంగాధర్ తిలక్ పాత్రను చరిత్రలో ప్రత్యేకంగా గుర్తిస్తారు.

బ్రిటిష్ పాలన కాలంలో ప్రజలను ఒకచోట చేర్చి సామాజిక, జాతీయ చైతన్యం కల్పించేందుకు ఆయన సామూహిక గణపతి ఉత్సవాలను ప్రోత్సహించారు.

దీంతో గణపతి ఉత్సవాలు క్రమంగా ప్రజలను ఏకం చేసే సామాజిక వేదికగా కూడా మారాయి.

నిమజ్జనం ఎందుకు చేస్తారు?

వినాయక చవితి పూజ అనంతరం నిర్ణీత రోజున గణపతి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేయడం సంప్రదాయం.

దీని వెనుక సృష్టిస్థితిలయ అనే తాత్విక భావనను అనుసంధానిస్తారు. మట్టితో తయారైన విగ్రహం పూజలందుకుని చివరకు నీటిలో కలసి తిరిగి ప్రకృతిలో భాగమవుతుంది.

ఇది జీవితం శాశ్వతం కాదని, ప్రకృతిలో పుట్టిన ప్రతి జీవి చివరకు ప్రకృతిలోనే కలిసిపోతుందనే సందేశాన్ని అందిస్తుంది.

పండుగతో పాటు బాధ్యత కూడా

ప్రస్తుత కాలంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించేటప్పుడు భక్తితో పాటు బాధ్యత కూడా అవసరం. అధిక శబ్దం, ప్లాస్టిక్ వినియోగం, రసాయన రంగులు, నీటి వనరుల్లో కాలుష్యం వంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.


మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించడం, సహజ రంగులను ఉపయోగించడం, ప్లాస్టిక్‌ను తగ్గించడం, నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడం ద్వారా పర్యావరణహితంగా పండుగను జరుపుకోవచ్చు.

వినాయక చవితి మనకు అందించే అసలైన సందేశం విఘ్నాలను తొలగించమని దేవుడిని కోరుకోవడమే కాదు. మన జీవితంలో ఉన్న అజ్ఞానం, అహంకారం, కోపం, స్వార్థం, నిర్లక్ష్యం వంటి విఘ్నాలను మనమే తొలగించుకోవాలని గుర్తుచేయడం.

గణపతిని పూజించడం అంటే జ్ఞానం, వివేకం, సహనం, మంచి ఆలోచనలను మన జీవితంలో ఆచరించడం.

**వినాయక చవితి ఒక పండుగ మాత్రమే కాదుఁ
ప్రకృతిని గౌరవించాలనే సందేశం,
సమాజంతో కలిసి నడవాలనే స్ఫూర్తి,
విఘ్నాలను అధిగమించాలనే సంకల్పం,
జ్ఞానంవివేకంతో జీవించాలనే బోధ.**

అందుకే ప్రతి ఏడాది వినాయక చవితి వచ్చినప్పుడు భక్తులు గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ "విఘ్నాలు తొలగాలిఁ జ్ఞానం పెరగాలి సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలి" అని ఆకాంక్షిస్తారు.



మట్టితో మహాగణపతి





నంద్యాల సెప్టెంబర్,13(రిపబ్లిక్ న్యూస్)

: కశెట్టి సుబ్బమ్మ మరియు బాలాజీ మర్చంట్స్ కమిటీ కళ్యాణ మండప దేవస్థానం నందు శ్రీ వరసిద్ధి వినాయక చవితి ఉత్సవాలను 40వ వార్షికోత్సవంగా నిర్వహించనున్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ నిమిత్తం నంద్యాల పట్టణంలో మొట్టమొదటిసారిగా గత 13 సంవత్సరాలుగా మట్టితో తయారు చేసిన విగ్రహాలను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో టంగుటూరు గ్రామానికి చెందిన కుమ్మరి మద్దిలేటి, ఆయన శిష్య బృందం మూడు నెలల పాటు శ్రమించి మట్టి విగ్రహాన్ని తయారు చేసి ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ప్రత్యేకతగా మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ అవతారాలతో విశ్వ సంరక్షక మహాగణపతిగా స్వామివారిని ఏర్పాటు చేశారు.ఆలయ అర్చకుల అర్చకత్వంలో ఈ నెల 14వ తేదీ సోమవారం నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 16వ తేదీ బుధవారం విశ్వ సంరక్షక మహాగణపతి హోమాన్ని నిర్వహించనున్నారు. ఈ హోమంలో భక్తాదులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.40 సంవత్సరాల వినాయక ఉత్సవాల సందర్భంగా మొట్టమొదటిసారిగా చేతి లడ్డూను ఏర్పాటు చేస్తున్నారు. 18వ తేదీ శుక్రవారం, నిమజ్జనం రోజున ఉదయం 11 గంటలకు దేవస్థానం నందు లడ్డూ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తాదులు ఈ లడ్డూ వేలంలో పాల్గొని స్వామివారి లడ్డూను స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. **కమిటీ సభ్యులు:**కశెట్టి కృష్ణమూర్తి దేవస్థాన అధ్యక్షులునారాయణ శ్రీనివాస కుమార్ ప్రధాన కార్యదర్శిదుద్దేల సురేష్ బాబు కోశాధికారిఈ కార్యక్రమంలో లగిశెట్టి నవీన్ కుమార్, లగ్గిశెట్టి ఋషి కుమార్, నల్లగట్ల నరసింహారావు, బొగ్గరపు వంశీకృష్ణ, కొప్పర్ల శ్రీనివాస్, రవితేజ, పాలూరి వెంకటనారాయణ, అడ్డగాళ్ళ చంద్రశేఖర్, సునీల్, పసుపుల శివ సాయి తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి నిర్వాహకులు:కశెట్టి చంద్రశేఖర్ బీజేపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి, దేవస్థానం ఉపాధ్యక్షులు.సహకరించిన వారు: నారాయణ ధీరజ్, బొగ్గారపు అభి.గత 25 సంవత్సరాలుగా 1,500 మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తూ వస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు

యస్ యస్ మాసజ్ సేంటర్ రాయికల్ లో ప్రారంభం..






రాయికల్ మండలం సెప్టెంబర్,13(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లాలోని రాయికల్ పట్టణం లోని వివేకవర్ధిని స్కూల్ పక్కన యస్ యస్ మాసజ్ సెంటర్ ను. చేర్ల కొండాపూర్ గ్రామానికి చెందిన బుడికె సంతోష్ నవ్య శ్రీ కి చెందిన మాస జ్ సెంటర్ ను యాజమాన్యం ప్రారంభించారు ఈ మెసేజ్ సెంటర్ ద్వారా చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఈ సెంటర్ ఇంతవరకు హైదరాబాద్ యందు చాలా వరకు విస్తారంగా ఉన్నాయని తెలిపారు..

ఈ సందర్భంగా మెసేజ్ సెంటర్ కు వచ్చిన మహితాపూర్ యాదవ సంఘం అధ్యక్షులు మరియు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బుస గంగా మల్లయ్య మెసేజ్ చేయించు కొని ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ. మన ఏరియాలో మనకు చాలా మంది కి అనవసరమైన పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చి ఇక్కడ అందరికీ ఉపయోగపడే విధంగా ఒక్కసారిగా మసాజ్ చేయించికొని వారు మళ్లీ మళ్లీ చేయించు కోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ మెసేజ్ సెంటర్ యందు పది నిమిషాలు చేసుకుని చాలా వరకు రిలీఫ్ అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఫుల్ బాడి షోల్డర్ బ్యాక్ విత్ రోలర్ డిప్ రిలాక్షేషన్ మరియు హెల్త్ ప్రియరిటి ఉంటుందని నిర్వాహకులు తెలిపారని హనుమల్ల సత్యనారాయణ తెలిపారు

రాయికల్ కు చెందిన చెట్పల్లి ప్రభాకర్ ఊపిరితిత్తుల సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాఅతనికి అత్యవసర సహాయం కోసం విజ్ఞప్తి



రాయికల్ మండలం సెప్టెంబర్,13(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ వాసి చెట్పల్లి ప్రభాకర్ ప్రస్తుతం తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో (లంగ్ డామేజ్) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉండటంతో, వైద్యుల పర్యవేక్షణలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

ఈ చికిత్సకు భారీగా ఖర్చు అవుతున్నందున, ప్రభాకర్ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది.ఈ క్లిష్ట సమయంలో మన వంతు సహాయం అందిద్దాం. మీరు అందించే చిన్న సహాయం కూడా ఆయన చికిత్సకు ఎంతో ఉపయోగపడుతుంది.మీకు సాధ్యమైనంత ఆర్థిక సహాయం చేయండి.మన మిత్రుడి ప్రాణాలను కాపాడేందుకు మనమంతా కలిసి నిలబడదాం.ఈ సందేశాన్ని మీ బంధువులు, మిత్రులు మరియు వాట్సాప్ గ్రూపుల్లో వీలైనంత ఎక్కువగా షేర్ చేయండి."మనిషికి మనిషే అండఁ ఆపదలో ఒక చిన్న తోడ్పాటే ప్రాణదానం." చెట్పల్లి ప్రభాకర్ గారి త్వరితగతిన కోలుకోవాలని మనస్ఫూర్తిగా ప్రార్థిద్దాం. సహాయం చేయడం కోసం చెట్పల్లి తేజశ్వనియూపీఐ / ఫోన్పే :+917893075285 బిబిబిబి

రాయికల్ మున్సిపల్ ఆధ్వర్యంలో

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



రాయికల్ మండలం సెప్టెంబర్,13(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధికారులు, కౌన్సిలర్లు పాల్గొని ప్రజలకు మట్టి విగ్రహాల వినియోగం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు, అనంతరం విగ్రహ ప్రతిమలను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ కౌన్సిలర్ రాకేష్ నాయక్, తురగా శ్రీధర్ రెడ్డి అందే భూమన్న బత్తిని నాగరాజు సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

స్నేహం చారిటబుల్ ట్రస్ట్ రాయికల్ వారి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది“ అజ్జు “కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేత



రాయికల్ మండలం సెప్టెంబర్,13(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ స్నేహం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యశీలో మున్సిపల్ సిబ్బంది సపయి కార్మికుడు “అజ్జు“ ఇటీవల మరణించగా ఆ యొక్క నిరుపేద కుటుంబానికి స్నేహం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యశీలో నిత్యావసర సరాకులు అందించడం జరిగింది ఈ కార్యక్రమశీలో ట్రస్ట్ ఫౌండర్, అధ్యక్షులు సందెల విక్రమ్,కో అప్షన్ మెంబెర్ మంజూరు , ట్రస్ట్ సభ్యులు రమేష్, అన్వేష్,దినేష్, విజయ్ తదితరులు తరులు పాల్గొనడం జరిగింది

కర్నూలుకే గర్వకారణం గరుడ అవార్డులు

మన కళాకారుల ప్రతిభ అద్వితీయం -కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు





కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 13(రిపబ్లిక్ న్యూస్)

రాష్ట్ర స్థాయిలో పేరొందిన గరుడ అవార్డుల్లో కర్నూలు కళాకారుల సత్తా జిల్లాకే గర్వకారణమని కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. టీటీడీ, ఎస్వీ నాట్యకళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల తిరుపతిలో జరిగిన గరుడ పద్య నాటక పోటీల్లో టీజీవీ కళాక్షేత్రానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ కమలపాలిక, నాటకం జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆదివారం కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కళాకారులకు గరుడ అవార్డుల ప్రదానం, సత్కార కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఓర్వకల్లు తహసీల్దారు విద్యాసాగర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. కర్నూలు కళాకారులు ఎక్కడ నాటకాలు ప్రదర్శించిన బహుమతులు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని, రాయలసీమ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలని ఆకాంక్షించారు. రాయలసీమకు ప్రధాన ద్వారంగా ఉన్న కర్నూలును గొప్ప గొప్ప కళాకారులు, మేధావులు ప్రపంచానికి పరిచయం అయ్యారన్నారు. కళాకారుల కోసం మంత్రి టీజీ భరత్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ఇలాంటి ఎన్నో మైలురాళ్లను అధిగమించాలని ఆకాంక్షించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. కళల కోసం టీజీ కుటుంబం చేస్తున్న సేవలు అనన్యమైనవన్నారు. ఇదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కళలు, కళాకారుల సంక్షేమానికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కళాకారులను చల్లా ఓబులేసుతో పాటు, తహసీల్దార్ విద్యా సాగర్, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు తదితరులు గరుడ అవార్డులతో ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రభుత్వం నుంచి ఉత్తమ అవార్డులు సాధించిన సిల్వర్ జూబ్లీ కళాశాల హిస్టరీ అధ్యాపకులు నాగ్ అరుణ్, ఎస్ ఏపీ క్యాంప్ నగర పాఠశాల ఉపాధ్యాయుడు పి. భాస్కర్ లను చల్లా ఓబులేసు, తహసీల్దారు విద్యాసాగర్, పత్తి ఓబులయ్య ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహ్మద్ మియ, సభ్యులు కల్లూరు శివయ్య, సీవీ రెడ్డి, సంగా ఆంజనేయులు, పి.రాజారత్నం, శ్రీనివాస రెడ్డి, కేవీ రమణ, కదిరి రమేష్, యాగంటీశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యులు(ఎం.పీ) ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలు

పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిడిశెట్టి రాజు



సిద్ధిపేట, సెప్టెంబర్ 13, (రిపబ్లిక్ న్యూస్):

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య 72వ, జన్మదిన వేడుకలు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, కంటస్టేడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో నిర్వహించగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. సాయి కృష్ణ హాస్పిటల్ లోని రోగులకు పండ్లు, బ్రేడ్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల ఉద్యమ రథసారది ర్యాగ కృష్ణయ్య గత 50 ఏళ్లుగా బీసీల కోసం నిరంతరంగా పోరాటం చేస్తూ అనేక జీవోలను సాధించి సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసే విధంగా ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ప్రవేశ పెట్టే విధంగా నిరంతరం నిరుద్యోగుల కోసం పోరాటం చేసే గొప్ప మహనీయులు ఆర్ కృష్ణయ్య అని, వారు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలనీ అ భగవంతుణ్ణి వేడుకున్నామని రాజు పేర్కొన్నారు. భవిష్యత్తులో అనేక పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని, మరెన్నో ఉన్నత పదవులు అది రోహించాలని ఆకాంక్షిశేచారు.ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సి ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా ఉప అధ్యక్షులు,సామాజిక కార్యకర్త డాక్టర్ వేల్పుల జయ శంకర్,జాతీయ బిసి సంక్షేమ సంఘం నాయకులు చేర్యాల మనోహర్,సాయికృష్ణ హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాస్, పద్మశాలి సేవా సంఘం నాయకులు నరాల శ్రీనివాస్ నేత,బీసీ మహిళా నాయకులు పి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో యాదవులకు, బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి

యాదవ హక్కుల పోరాట సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు బల్కం మల్లేష్ యాదవ్ డిమాండ్...



రాయికల్ మండలం సెప్టెంబర్,13(రిపబ్లిక్ న్యూస్)

చట్ట సభల్లో యాదవులకు, బిసిలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని యాదవ హక్కుల పోరాట సమితి జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు బల్కం మల్లేష్ యాదవ్ డిమాండ్ చేసారు. ఆదివారం రాయికల్ మండల కేంద్రంలో పట్టణ యాదవ సంఘ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాజ్యాంగ సవరణ ద్వారా యస్.సి, యస్టీలకు చట్ట సభల్లో రిజర్వేషన్ లు కల్పించినట్లుగానే యాదవులకు, బిసిలకు రిజర్వేషన్ లు కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసారు. రాజ్యాధికారం ద్వారానే బిసిల, యాదవుల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. దేశరక్షణ జాతీయ భావన కలిగి ఉండాలని, ఇవి బాగున్నప్పుడే మిగతావన్ని కాపాడుతాయని అన్నారు. దేశం ధర్మం బాగాలేనప్పుడు ఏ కులం ఎవరికి కాపాడలేవని అన్నారు. అలాగే యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ మాట్లాడుతూ బిసి ఉద్యోగులకు, యాదవ ఉద్యోగులకు కూడా పదోన్నతులలో రిజర్వేషన్ లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో కాశవేని రాజేష్ యాదవ్, గన్నవేణి మహేష్ యాదవ్, కాశవేని హర్షిత్ యాదవ్, జక్కుల రాజేష్ యాదవ్, ఎల్లంల తిరుపతి యాదవ్, ఆసరి బన్ని యాదవ్, దానవేణి మహిపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ మున్సిపల్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



రాయికల్ మండలం సెప్టెంబర్,13(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధికారులు, కౌన్సిలర్లు పాల్గొని ప్రజలకు మట్టి విగ్రహాల వినియోగం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు, అనంతరం విగ్రహ ప్రతిమలను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ కౌన్సిలర్ రాకేష్ నాయక్, తురగా శ్రీధర్ రెడ్డి అందే భూమన్న బత్తిని నాగరాజు సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

22ఏ పేరుతో పట్టాదారు రైతుల భూములపై కాంగ్రెస్ భూదందా

నిజమైన హక్కుదారులను వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

జగిత్యాల జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ దావ వసంత సురేష్ డిమాండ్



రాయికల్ మండలం సెప్టెంబర్,13(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఈ సందర్భంగా దావసంత సురేష్ మాట్లాడుతూ...రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు పూర్తికావస్తుందని అమలు కాని అనాలోచిత హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేశారని అన్నారు కెసిఆర్ నాయకత్వంలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు చేకూర్చాల్సిన లబ్ధి గురించి ప్రజల గొంతుకై ప్రశ్నించడం జరిగిందని అన్నారు.

ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి 22 ఏ నిషేధిత జాబితాలో పట్టాదారు రైతులను కూడా చేర్చారని అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి “దోచుకోవడం దాచుకోవడం“ తప్ప ఏమీ తెలియదని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని అన్నారు.

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి రైతుల భూమి మీద కన్ను పడిందని దీనికి వెనుక నుండి రేవంత్ రెడ్డి ప్రోత్సహిస్తున్నాడని అన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి 22ఏ కొత్త భూధందాకు తెర లేపారు అన్నారు.

తెలంగాణ రాష్ట్రం మొత్తం కోటి ఎకరాల భూమిని 22ఛ జాబితా కింద చేర్చారు ప్రభుత్వ నికి చెందిన భూములు, పేదలకు పంచిన భూములు, దేవాదాయ శాఖ భూములు మరియు వక్స్ భూములు వంటి వాటిని ప్రభుత్వం కాపాడాలని 22ఏ చట్టం చెప్తుందని అన్నారు.

కానీ ఇక్కడ రేవంత్ రెడ్డి మొత్తం రెవెన్యూ నింపుకొని దానిని ఢిల్లీకి సంచులు మోస్తున్నాడు అని అన్నారు. జగిత్యాల నియోజకవర్గం లో 16 వేల 5 ఎకరాలు పట్టా భూములను నిషేధిత భూమి కింద చేర్చడం జరిగింది అని అన్నారు.రేవంత్ రెడ్డి భూదందాకు తెరలేపి ఆఫీసులో చేతులు తడిపితే నిషేధిత భూమి కింద నుంచి తీసివేయడం జరుగుతుందని అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల రైతులతో ఎందుకు చెలగాటం ఆడుతుందని అన్నారు. నిజంగా హక్కుదారులను పరిశీలించి వెంటనే నిషేధిత భూమి కింద నుంచి వారిని తీసివేయాలని డిమాండ్ చేశారు. గ్రామ గ్రామాన రైతులతో రెవెన్యూ సదస్సు నిర్వహించి ప్రభుత్వ భూముల పట్టా భూముల అని ఎంక్వయిరీ చేయాలని అన్నారు.

చాలా మంది రైతులకు 22ఏ నిషేధిత భూమిలో తమ భూమి ఉందని తెలియదు అని అన్నారు.

కొంతమంది రైతులు తుట్టికి పావు సేరు చొప్పున అమ్ముకుంటున్నారని అన్నారు.మీ రెవెన్యూ నింపుకోవడానికి తప్ప పేద ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేనిదే ఈ 22ఏ అని అన్నారు.

22 ఏ చట్టాన్ని ఒకసారి చదివి రేవంత్ రెడ్డికి జ్ఞానోదయం కలగాలని కోరుకున్నారు.

తెలంగాణలో 24 గంటల కరెంటు కోతాలతో రైతును కూడా సరిగ్గా నిద్ర కూడా పోవడం లేదు అని అన్నారు.

ఎరువులను యాప్ లో పెట్టి రైతులు పొలం కాడ ఉండాలా ఫోన్ చూస్తూ ఉండాలా అని అన్నారు.

కెసిఆర్ గారి హయాంలో ఎరువులను ఫర్టిలైజర్ షాపు మరియు సొసైటీ ఆధ్వర్యంలో ఇచ్చినప్పుడు మీకెందుకు సాధ్యమైతలేదని ప్రశ్నించారు.

కాలేశ్వరం ప్రాజెక్టు సద్వినియోగం చేసుకోక పొలాలకు నీళ్లు ఇవ్వలేక రైతులను అరిగోసపెడుతున్నారని అన్నారు. ఎలినో ప్రభావం ఉంటదని శాస్త్రవేత్తలు ఆరు నెలల నుంచి కూడా హెచ్చరించిన ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదని అన్నారు రైతులకు క్రాఫ్ హాలిడే ప్రకటించి ఎకరానికి 20వేల పరిహారం ఇస్తే రైతులకు నీళ్లు ఎరువులు కరెంటు ఇవ్వాల్సిన అవసరం ఉండేది కాదు కదా అని అన్నారు.

ఒక పక్క కరువు మరోపక్క రేవంత్ రెడ్డి మూర్ఖపు ఆలోచనలు తెలంగాణకు పట్టిన శని అని అన్నారు.

చంద్రబాబు డైరెక్షన్లో రేవంత్ రెడ్డి నడుస్తు మన నీళ్లన్నీ ఆంధ్రావాళ్లు తీసుకెళ్తున్నారని అన్నారు.

నిజమైన పట్టా హక్కు దారులను నిషేధిత భూమిల నుండి తొలగించాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ప్రతిపక్షం లేకుండా అసెంబ్లీ నడిపిన చరిత్ర లేదని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు లేక బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మరియు మండల అధ్యక్షుడు అనిల్ కుమార్ బర్కాం మల్లేష్ కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి జగిత్యాల పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి నాయకులు గోపి రాజి రెడ్డి బత్తిని నాగరాజు ప్రశాంత్ రావు రామపతి రావు చాంద్ పాషా సంతోష్ రావు పడిగేలా గంగారెడ్డి సత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.!


..రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.

..ప్రమాదవశాత్తు మరణించిన ముగ్గురు కార్యకర్తల నామినీలకు రూ. 5 లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కుల పంపిణీ.

..నంద్యాల క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేసిన మంత్రి ఫరూక్.

నంద్యాల సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్):

తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం శ్రమించిన కార్యకర్తలను, వారి కుటుంబాలను తెలుగుదేశం పార్టీ ఎన్నడూ మరువదని, అన్నివేళలా అండగా నిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయం నందు ప్రమాదవశాత్తు మరణించిన పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ విభాగం ద్వారా మంజూరైన ప్రమాద బీమా చెక్కులను మంత్రి ఫరూక్ స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. టీడీపీ పార్టీని నమ్ముకుని అహర్నిశలు పనిచేసే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకోవడమే టీడీపీ ధ్యేయమన్నారు. అకాల మరణం చెందిన కార్యకర్తల లోటు పార్టీకి తీరనిదని, వారి కుటుంబాలు ఆత్మస్థైర్యంతో నిలబడేందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ప్రమాద బీమా కింద రూ. 5 లక్షల (ముగ్గురికి 15 లక్షల రూపాయలు) ఆర్థిక సాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీమా చెక్కులు అందుకున్న బాధిత కుటుంబాల వివరాలు



1).దివంగత అక్కమ్మల సివయ్య కుటుంబం.

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 1 వ వార్డ్ (ఇంటి నెంబర్ 24-32) దివంగత కార్యకర్త అక్కమ్మల సివయ్య నామినీ అయిన వారి కుటుంబ సభ్యురాలు బంగారిగళ్ళ శాంతకుమారి కి రూ. 5,00,000/- (ఐదు లక్షల రూపాయల) బీమా చెక్కును అందజేశారు.

2).దివంగత బాల వెంకటరాహుల్ కుటుంబం

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 1 వ వార్డ్ (హౌస్ నెంబర్ 7-300) దివంగత కార్యకర్త బాల వెంకటరాహుల్ నామినీ చంద్రకళ ఆవుల కి రూ. 5,00,000/- (ఐదు లక్షల రూపాయల) ప్రమాద బీమా చెక్కును అందజేశారు.

3)దివంగత మిట్నాల జగదీష్ కుమార్ కుటుంబం.

నంద్యాల టౌన్ 17వ వార్డుకు చెందిన దివంగత కార్యకర్త మిట్నాల జగదీష్ కుమార్ గారి భార్య మిట్నాల మునీశ్వరి గారికి రూ. 5,00,000/- (ఐదు లక్షల రూపాయల) ప్రమాద బీమా చెక్కును అందజేశారు..

ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులతో పాటు టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి రామచంద్రరావు, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, నంద్యాల ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ నాగార్జున, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సుమలత, 17వ వార్డు టిడిపి ఇంచార్జి రామ్ మద్దయ్య మరియు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




నా సినిమాలను నేను చూడలేను: ప్రీతి జింటా

ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. 'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.

తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపోస్టర్ సిండ్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.

రచ్చ లేపడానికి రెడీ..

ఒక్క పోస్టుతో 'స్వయంభూ'పై అంచనాలు పెంచేసిన నిఖిల్



యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రం 'స్వయంభూ'పై అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై నిఖిల్ తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ పంచుకున్నారు. ఒకే సినిమా కోసం 175 రోజులు షూటింగ్ చేయడం, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉండటం తన కెరీర్‌లో ఇదే తొలిసారని ఆయన తెలిపారు. మంచి ప్రయత్నాలకు సమయం పడుతుందని, త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు.ఈ మేరకు నిఖిల్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. "'స్వయంభూ' ఒక పాన్ ఇండియా చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మంచి పనులకు సమయం పడుతుంది. మేము దాదాపు ఆ దశకు చేరుకున్నాం. ఒకే సినిమా కోసం 175 రోజులు షూట్ చేస్తానని, 2500 గ్రాఫిక్స్ షాట్లు ఉంటాయని నేను ఎప్పుడూ ఊహించలేదు. కానీ... రచ్చ లేపడానికి రెడీ. త్వరలోనే విడుదల తేదీ ప్రకటన ఉంటుంది" అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది.ఇటీవల హీరోయిన్ సంయుక్త పుట్టినరోజు సందర్భంగా, ఆమె పోషిస్తున్న 'భూమి' పాత్రకు సంబంధించిన ఒక బీటీఎస్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె పడిన కష్టం స్పష్టంగా కనిపించింది. ఈ సినిమా కోసం సంయుక్త ఎంతో ధైర్యంగా ఒక ప్రమాదకరమైన స్టంట్ చేశారని దర్శకుడు భరత్ కృష్ణమాచారి గతంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లిలో చిత్రీకరించిన ఒక సన్నివేశంలో, కింద నది ప్రవహిస్తుండగా కేవలం ఒకే ఒక్క హార్నెస్ సాయంతో ఆమె రెండు రోజుల పాటు తాడుపై వేలాడుతూ పర్వతాన్ని అధిరోహించారని వివరించారు.ఈ సినిమా కోసం హీరో నిఖిల్ కూడా వియత్నాం వెళ్లి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. రెండు చేతులతో కత్తి యుద్ధం చేయడంలో ఆయన ప్రావీణ్యం సంపాదించారు.

కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా సినిమాలో నటించిన వందలాది మంది సహాయ నటీనటులకు కూడా వియత్నాం నుంచి వచ్చిన నిపుణులతో కత్తి యుద్ధంలో శిక్షణ ఇప్పించారు

. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో దాదాపు 60 రోజుల పాటు భారీ క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించారు.

విడుదలకు ముందే 'స్పిరిట్' పై రగడ..

రివ్యూవర్స్‌కు సందీప్ వంగా సోదరుడి సవాల్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న 'స్పిరిట్' చిత్రంపై అప్పుడే ఓ కొత్త వివాదం రాజుకుంది. సినిమా విడుదల కాకముందే, సినీ విమర్శకులను ఉద్దేశించి సందీప్ సోదరుడు, చిత్ర నిర్మాతల్లో ఒకరైన ప్రణయ్ రెడ్డి వంగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. 'స్పిరిట్' సినిమాను తమ రివ్యూలతో 'చంపేయండి' చూద్దాం అంటూ ఆయన బహిరంగంగా సవాల్ విసిరారు.

ఇటీవల ఆయన నిర్మాణంలో వచ్చిన 'రోమాంచకం' చిత్రానికి మిశ్రమ స్పందన లభించిన నేపథ్యంలో ప్రణయ్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక సినిమాను తెరకెక్కించడానికి పడే కష్టం తెలియకుండా విమర్శకులు సులభంగా రివ్యూలు రాస్తున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

"మీరు నిర్మాణ రంగంలోకి వస్తేనే ఒక దర్శకుడు కథను తెరపైకి తీసుకురావడానికి ఎంత కష్టపడతాడో, ఎన్ని సమస్యలు ఎదురవుతాయో తెలుస్తుంది" అని ఆయన అన్నారు.ఈ క్రమంలోనే తమ తదుపరి భారీ ప్రాజెక్ట్ 'స్పిరిట్' గురించి ప్రస్తావిస్తూ.. "వారికి నిజంగా సత్తా ఉంటే, 'స్పిరిట్' విడుదలైనప్పుడు చూద్దాం. ఆ సినిమా రిలీజ్ అయ్యాక దాని స్పిరిట్‌ను 'కిల్' చేయడానికి ప్రయత్నించండి, అప్పుడు చూసుకుందాం" అని ప్రణయ్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు.

'స్పిరిట్' సినిమా విషయానికొస్తే.. ప్రభాస్-సందీప్ వంగా కలయికలో వస్తున్న తొలి చిత్రమిది. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ మూవీలో ప్రభాస్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఈ చిత్రంలో కథానాయికగా 'యానిమల్' ఫేమ్ తృప్తి డిమ్రీని ఖరారు చేశారు. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రలో కనిపించనున్నారు.ఇదిలా ఉంటే.. సల్మాన్ ఖాన్ సినిమాతో పోటీని తప్పించుకోవడానికి 'స్పిరిట్' విడుదల 2027 ఈద్ నుంచి వాయిదా పడుతుందని ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే, ఈ ప్రచారాన్ని చిత్ర నిర్మాణ సంస్థ టీ-సిరీస్ కొట్టిపారేసింది. "సినిమా విడుదల తేదీలో ఎటువంటి మార్పు లేదు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే షూటింగ్ జరుగుతోంది. 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా 'స్పిరిట్' ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అని టీ-సిరీస్ ప్రతినిధి స్పష్టం చేశారు.



రామ్ పోతినేని సినిమాలో హీరోయిన్‌గా సంయుక్త

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'చ=ఌూ23'. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు చిత్రబృందం తెరదించింది. ప్రముఖ నటి సంయుక్తను కథానాయికగా ఎంపిక చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం సంయుక్త పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రకటన వెలువడటం విశేషం.సంయుక్తకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రాజెక్ట్‌లోకి ఆమెను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు మేకర్స్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. రామ్, సంయుక్త జంటగా నటిస్తున్న తొలి చిత్రం కావడంతో ఈ నూతన కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని ఒక వినూత్నమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు.

నియో-నోయర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రానికి సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు. రామ్ సోదరుడు కృష్ణ పోతినేని భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటివరకు కనిపించని సరికొత్త అవతార్‌లో రామ్ ఈ సినిమాలో అలరించనున్నారని, నటుడిగానే కాకుండా దర్శకుడిగా కూడా ఈ చిత్రం ఆయన కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని చిత్ర వర్గాలు వెల్లడించాయి.

పెళ్లి గుర్తుగా పురుషులు కూడా ఏదైనా ధరించాలి: నటి నమిత

ఒకప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి నమిత... పెళ్లి చేసుకున్న తర్వాత సినిమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా వివాహ వ్యవస్థ, మహిళలపై అమలవుతున్న సంప్రదాయ నిబంధనలపై చేసిన వ్యాఖ్యలతో మరోసారి చర్చల్లో నిలిచారు. వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల జీవితాలను, భావోద్వేగాలను కలిపే సమానమైన బంధమని... అలాంటప్పుడు పెళ్లికి సంబంధించిన నియమాలు, బాధ్యతలు కేవలం మహిళలకే ఎందుకు పరిమితం కావాలని ఆమె ప్రశ్నించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.వివాహ ఆచారాల గురించి మాట్లాడుతూ... పెళ్లి తర్వాత మహిళలు ఎలా ఉండాలి, ఏం ధరించాలి, ఏయే సంప్రదాయాలను పాటించాలి అనే విషయంలో సమాజంలో ఎన్నో నియమాలు ఉంటాయని నమిత అన్నారు. కానీ పురుషుల విషయంలో ఇలాంటి నిబంధనలు, ఆంక్షలు చాలా తక్కువగా ఉండటం సరైనది కాదని... మారుతున్న కాలానికి అనుగుణంగా అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వివాహానికి గుర్తుగా మహిళలు మాత్రమే తాళిబొట్టు ఎందుకు ధరించాలని, పెళ్లయిందనే గుర్తింపుగా పురుషులు కూడా ఏదో ఒక గుర్తును ఎందుకు ధరించకూడదని ఆమె అన్నారు.నమిత చేసిన ఈ వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆధునిక కాలంలో భార్యాభర్తలిద్దరికీ సమాన హక్కులు, ప్రాధాన్యత ఉండాలని కోరుకునే కొందరు నెటిజన్లు ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తుండగా... మరికొందరు మాత్రం తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాల ప్రాధాన్యతను అర్థం చేసుకోకుండా ఇలా ప్రశ్నించడం సరికాదని విమర్శలు గుప్పిస్తున్నారు.



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌కు విరామం

వినాయక చవితి సందర్భంగా ప్రభుత్వ సెలవు - జిల్లా ప్రజలు గమనించాలి

నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 13 (రిపబ్లిక్ న్యూస్)



వినాయక చవితి పండుగ సందర్భంగా సెప్టెంబర్ 14వ తేదీ సోమవారం ప్రభుత్వ సెలవు దినంగా ఉన్నందున నంద్యాల కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించబడవని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, అర్జీలు సమర్పించేందుకు సెప్టెంబర్ 14న కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచించారు.

విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలి

జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ

నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 13 (రిపబ్లిక్ న్యూస్)



వినాయక చవితి పర్వదినాన్ని జిల్లా ప్రజలందరూ కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, రాష్ట్ర రోడ్లు-భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సైతం జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విఘ్నేశ్వరుని అనుగ్రహంతో ప్రతి ఇల్లు సుఖసంతోషాలు, సౌభాగ్యాలతో కళకళలాడాలని, ప్రజల జీవితాల్లోని విఘ్నాలన్నీ తొలగిపోయి ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, ఆనందంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాలు మరింత ఫలవంతం కావాలని వారు ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో, ఆనందోత్సాహాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ జరుపుకోవాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక విగ్రహాలను వినియోగిస్తూ పండుగను పర్యావరణహితంగా నిర్వహించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 13)



వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సోదరభావం, మత సామరస్యంతో వినాయక చవితి వేడుకలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.వినాయక మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. ఇతరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విగ్రహాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేసుకోవడంతో పాటు రాత్రి వేళల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.నిబంధనల మేరకే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు గణేష్ ఉత్సవ కమిటీలు, మత పెద్దలు, యువత, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.వదంతులను నమ్మొద్దు.. షేర్ చేయొద్దు: సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే అసత్య ప్రచారాలు, వదంతులను ప్రజలు నమ్మవద్దని ఎస్పీ స్పష్టం చేశారు. వాటిని ఇతరులకు షేర్ చేయకుండా, నిజానిజాలను నిర్ధారించుకునేందుకు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు లేదా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత స్థానిక పోలీసులకు, డయల్-112 లేదా డయల్-100కు సమాచారం అందించాలని జిల్లా ప్రజలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు.

శ్రీకృష్ణదేవరాయలు అందరికీ ఆదర్శప్రాయుడు

: రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

ఎన్టీఆర్ కాంప్లెక్స్ ఆవరణలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ.

ప్రజా సంక్షేమం, సాగునీటి రంగంలో రాయల పాలన స్ఫూర్తిదాయకం



నంద్యాల సెప్టెంబర్ 13(రిపబ్లిక్ న్యూస్) :

ప్రజా సంక్షేమ పాలనలో విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు . ఆదివారం స్థానిక ఎన్టీఆర్ కాంప్లెక్స్ ఆవరణలో బలిజ సంఘం మరియు కాపు రాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని మంత్రి ఫరూక్ ఘనంగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టిన గొప్ప చక్రవర్తి అని కొనియాడారు. ప్రజల సాగునీరు, తాగునీటి అవసరాల కోసం చెరువులు, కుంటలను తవ్వించి చరిత్రలో నిలిచారని గుర్తుచేశారు. శ్రీకృష్ణదేవరాయలు అందరివాడని, ఆయన విగ్రహ ఏర్పాటు విషయంలో ఎలాంటి వివాదాలకు తావులేదని స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారికి ఎన్నో అమూల్యమైన వజ్రాభరణాలు, బంగారు నగల సమర్పణతో పాటు చారిత్రాత్మక కట్టడాలెన్నో నిర్మించారని తెలిపారు . మార్కాపురం సమీపంలోని కంబంలో తన భార్య పేరు మీద నిర్మించిన చెరువు నేటికీ దేశంలోనే అత్యంత పెద్ద చెరువుల్లో ఒకటిగా రికార్డు సాధించిందని గుర్తుచేశారు.

మంత్రి ఫరూక్ చొరవ అభినందనీయం

దశాబ్దాలుగా విగ్రహ ఏర్పాటు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, మంత్రి ఫరూక్ తీసుకున్న ప్రత్యేక చొరవ వల్లే ఈరోజు విగ్రహావిష్కరణ సాధ్యమైందని సంఘ పెద్దలు కొనియాడారు. గతంలో బలిజ సామాజిక వర్గానికి చెందిన పాణ్యం రామయ్యకు మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం కల్పించడంతో పాటు శాంతిరాముడు వంటి ప్రముఖులకు అండగా నిలిచారని, భవిష్యత్తులోనూ ఫరూక్ కుటుంబానికి పూర్తి మద్దతు ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

విగ్రహ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన కామిని మల్లికార్జున, చెన్నంశెట్టి శ్రీనివాసులు , కొప్పుల మురళి, చింతల కుమార్, ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ చలం బాబు, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు నాగరాజు, సుబ్బయ్య, గోపాల్, పాణ్యం శ్రీకాంత్ తదితరులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది రామచంద్రరావు, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, శాంతిరాం విద్యాసంస్థల అధినేత శాంతిరాముడు, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, పౌరాణికవేత్త రాజారాం, వైద్యులు రవికృష్ణ, నారాయణ, ఆర్పీఎఫ్ అధ్యక్షుడు రెడ్డి శేఖర్, ఏపీపీఎస్సీ డైరెక్టర్ శివరాం, అహోబిలం బలిజ అన్నదాన సత్రం అధ్యక్షుడు విజయ్, బలిజ సంఘం మాజీ అధ్యక్షుడు పడకండ్ల సుబ్రహ్మణ్యం, చింతల రామకృష్ణ, అభిమన్యుడు, మల్లయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజిద్దాం

3,000 మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ

మట్టి వినాయకుడి నిమజ్జనం అనంతరం మొక్కను నాటాలి

ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





నంద్యాల బ్యూరో, సెప్టెంబరు 13 (రిపబ్లిక్ న్యూస్)

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నంద్యాల జిల్లా యంత్రాంగం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా జిల్లాలో 3,000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ భవనం సమీపంలో ఉన్న రెవెన్యూ క్లినిక్ వద్ద ప్రజలకు జిల్లా కలెక్టర్ స్వయంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయన రంగులతో తయారు చేసే వినాయక విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమై పర్యావరణానికి హాని కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతగా వ్యవహరించి మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలని ఆమె పిలుపునిచ్చారు. మట్టి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా నీటి వనరులను వినియోగించాల్సిన అవసరం లేకుండా, ఇంటివద్దే ఒక పూలకుండీలో నిమజ్జనం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జనం పూర్తయిన అనంతరం అదే కుండీలో ఒక మొక్కను నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆమె కోరారు.

గణేష్ మండపాల నిర్వాహకులు భద్రతా నిబంధనలు పాటించాలి

జిల్లాలో గణేష్ మండపాల నిర్వాహకులు సంబంధిత అధికారులు, ఉత్సవ కమిటీలు జారీ చేసే సూచనలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ లైన్ల విషయంలో ప్రత్యేక అప్రమత్తత వహించాలని, విద్యుత్ తీగలను కర్రలతో నెట్టడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఏదైనా చిన్న సమస్య ఎదురైనా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా ఘనంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ

కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి చేపడుతున్న చర్యలకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.



ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, సాధ్యమైనంత వరకు ఇంటివద్దే మట్టి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, మెంబర్ సెక్రటరీల సూచనలు, ఆదేశాల మేరకు మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు

కేసీ కాలువ, నన్నూర్ టోల్ ప్లాజా వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి టీజీ భరత్



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 13)

కర్నూలు నగరంలో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలులోని వినాయక ఘాట్ వద్ద కేసీ కాలువ, నన్నూర్ టోల్ ప్లాజా వద్ద హంద్రీనీవా ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన మంత్రి.. నిమజ్జనానికి అవసరమైన నీటి లభ్యత, భద్రత, మౌలిక సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. సుంకేసుల బ్యారేజీలో గత 20 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యల్పంగా 0.288 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉందని తెలిపారు. దీంతో అక్కడి నుంచి నేరుగా కేసీ కాలువకు నిమజ్జనం కోసం నీటిని విడుదల చేసే పరిస్థితి లేదన్నారు.ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా వినాయక ఘాట్ వద్ద కేసీ కాలువకు ఇరువైపులా గోడలు నిర్మించి ట్యాంక్ తరహాలో నీటిని నిల్వ చేసేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పంప్‌హౌస్ నుంచి ప్రతిరోజూ వృథాగా పోతున్న సుమారు 20 లక్షల లీటర్ల నీటిని కేసీ కాలువకు తరలించి, వినాయక ఘాట్ వద్ద ఏర్పాటు చేసే ప్రత్యేక ట్యాంక్‌లో నిల్వ చేయనున్నట్లు వివరించారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో క్రేన్లు, ఇతర అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుతం హంద్రీనీవాలో నీటి ప్రవాహం బాగుందని, వినాయక నిమజ్జనం సమయంలోనూ నిరంతర నీటి ప్రవాహం ఉండే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. కేసీ కాలువ, నన్నూర్ టోల్ గేట్ వద్ద హంద్రీనీవా ప్రాంతాలను వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు పరిశీలించాలని సూచించారు. కమిటీ సభ్యుల పరిశీలన, వారి నిర్ణయం ఆధారంగా



నిమజ్జనానికి తుది ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు.వచ్చే జూన్ వరకు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే వినాయక నిమజ్జనాన్ని కూడా ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కర్నూలులో రాష్ట్రంలోనే అత్యంత వైభవంగా వినాయక నిమజ్జనం నిర్వహించేలా ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

సోమవారం 14న పి జి ఆర్ ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) ఉండదు.

..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి.



కర్నూలు , సెప్టెంబర్ 13,(రిపబ్లిక్ న్యూస్):

వినాయక చవితి పండుగ సందర్భంగా సోమవారం 14 వ తారీకున ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఒక ప్రకటనలో తెలియజేశారు.సోమవారం 14 వ తారీఖు న వినాయక చవితి పండుగకు గాను రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినముగా ప్రకటించినందున 14వ తారీఖున ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జిల్లాలో నిర్వహించబడదు అని తెలిపారు ,కావున ప్రజలు ఈ విషయమును గమనించుకుని ఫిర్యాదులు ఇవ్వడానికి రాకూడదని ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.గణనాథుని కృపతో జిల్లా అభివృద్ధితో పాటు ప్రజలంతా సంతోషంగా ఉండాలని, వినాయకుడి ఆశీస్సులతో ప్రజలకు మంచి జరగాలని, చేపట్టే ప్రతి పనిలో విజయం చేకూరాలని కలెక్టర్ ఆకాంక్షించారు.పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మట్టి వినాయకుని విగ్రహాలతో పూజలు జరుపుకుని, సంతోషంతో పండుగ చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com